Follow: @ANNTELUGU
10-07-2025
ANN తెలుగు
# మహా పత్రిక
గురువారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 217 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## గుజరాత్‌లో ఒక్కసారిగా కుప్పకూలిన బ్రిడ్జి

**పది మంది మృతి.. విచారణకు సీఎం ఆదేశం**

**గుజరాత్:** వడోదరలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వడోదర జిల్లాలోని మహిసాగర్ నది మీద ఉన్న గంభీరా వంతెన ఒక్కసారిగా కుప్పకూలింది. బుధవారం ఉదయం జరిగిన ఈ ఘటనలో బ్రిడ్జిపై ప్రయాణిస్తున్న 5వాహనాలు నదిలో పడిపోయాయి. బ్రిడ్జ్ మీద నుంచి వాహనాలు పడిపోవడంతో ఈ ఘటనలో మొదట ముగ్గురు మృతి చెందినట్లు గుర్తించారు. పలువురు కొట్టుకుపోయారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే ఈ ఘటనలో మృతుల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతూనే ఉంది. ఇప్పటి వరకు ఈ ఘటనలో మొత్తం 10 మంది చనిపోయినట్లు మంత్రి రిశికేష్ పటేల్ వెల్లడించారు.

మిగతా 2లో

### టాప్ న్యూస్



**చాన్స్ ఇస్తే జూబ్లీహిల్స్‌లో**
## పోటీ చేస్తా!

- ఉప ఎన్నిక అభ్యర్థి ఎవరనేది అధిష్ఠానం ఇష్టం
- రాజాసింగ్ కంటే అప్పుడు నాకే ఓట్లు ఎక్కువొచ్చాయ్
- పార్టీ నుంచి ఎందుకు వెళ్లి పోయారో ఆయనకే తెల్వదు
- బీజేపీ నాయకురాలు మాధవి లతా కీలక వ్యాఖ్యలు


02



## రాజకీయాలు ఆస్వాదించడం లేదు

- కంగనా రనౌత్ సంచలన వ్యాఖ్యలు
- పంచాయతీ స్థాయి సమస్యలతో ప్రజలు నా వద్దకు వస్తున్నారు
- ప్రజాసేవ నేపథ్యం లేదు.. స్వార్థపూరిత జీవితం గడిపా
- ప్రధానమంత్రి పదవికి తాను తగిన వ్యక్తిని కానన్న కంగన

02



**రాజకీయాల నుంచి**
## రిటైర్ అయ్యాక

- వేదాలు, ఉపనిషత్తులు చదువుతా
- ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెడతా
- హోం శాఖ కన్నా సహకార శాఖే తనకు పెద్దది
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా

02

### సభకు మీరు వస్తారా?

# ఎర్రవల్లి ఫామ్ హౌస్‌కి నన్ను రమ్మంటూరా?

**కేసీఆర్ కు సీఎం రేవంత్ రెడ్డి**
## ఓపెన్ ఆఫర్

- ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో మాక్ అసెంబ్లీకి రెడీ
- తెలంగాణకు మరణశాసనం రాసింది కేసీఆరే
- కృష్ణా జలాల అంశంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్.. హాజరైన సీఎం



**మీరు కుర్చీలో కూర్చోండి..**
### చర్చ పెడదాం

కేసీఆర్.. ప్రతిపక్ష నాయకుడు. ఆయన ఆరోగ్యం బాగుండాలి అని నేను కోరుకుంటున్న. ఆయన కొడుకు మాత్రం ఆయనేందుకు.. నేనున్న అంటారు. మీ కుటుంబ సభ్యుల లొల్లి ఉంటే కుల పెద్దల్లో.. ఇంటి పెద్దల్లో కూర్చొని మాట్లాడుకోండి. ఎర్రవల్లి ఫామ్ హౌస్ కి మా మంత్రులను పంపిస్తా. కేసీఆర్ ఆరోగ్యం సహకరించక పోతే కుర్చీలో కూర్చోండి. ఎర్రవెల్లి ఫామ్ హౌస్ లో మాక్ అసెంబ్లీ పెడదాం. మంత్రులు వద్దు అంటే... నేనే వస్తా. క్లబ్బులు.. పబ్బులకు మేము దూరం అని రేవంత్ ఎద్దేవా చేశారు. ప్రజాభవన్ గడి కాదు, ఇక్కడ ధర్మగంట ఎవరైనా కొట్టవచ్చని స్పష్టం చేశారు.

“ మీ అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుంటాం.. మీ సూచనలు తెలంగాణకు ప్రయోజనం చేకూరుతాయంటే తీసుకుంటామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఓపెన్ ఆఫర్ ఇచ్చారు. కృష్ణా జలాల అంశంపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌కు సీఎం హాజరై మాట్లాడారు. కేసీఆర్...మీరు రండి. నిపుణులను పిలుస్తాం. మా డాక్యుమెంట్ సభలో పెడతాం. మీరు సూచన చేయండి.. అవసరం అనుకుంటే మార్చుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది.. ఎక్స్‌ఫర్ట్స్ ఒపీనియన్ కూడా సభలో వినిపిద్దామన్నారు. మీరు శాసనసభ సమావేశాలు పెట్టాలని ఎప్పుడు స్పీకర్ కు లేఖ రాసినా మేం సిద్ధమన్నారు. మీ హయాంలో, మా హయాంలో తీసుకున్న నిర్ణయాలపై చర్చ పెడదామన్నారు. - మహా, హైదరాబాద్

02

### కృష్ణా వాటాలో ద్రోహం చేసిందే కేసీఆర్ ..పీపీటీలో ఉత్తమ్ ఫైర్

02



**సీఎం రేవంత్ వినతికి స్పందించిన కేంద్రం**

## యూరియా కొరత ఉండొద్దు

**తెలంగాణకు సరిపడా ఎరువులు ఇస్తామని జేపీ నడ్డా వెల్లడి**

**పంపిణీ చేసేలా చూడాలని అధికారులకు కేంద్రమంత్రి ఆదేశాలు**

**ఢిల్లీ, మహా:** ఖరీఫ్ సీజన్‌లో తమ రాష్ట్రంలో యూరియాకు గరిష్టంగా డిమాండ్ ఉంటుందంటూ కేంద్రమంత్రి జేపీ నడ్డాకి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన విజ్ఞప్తికి కేంద్రం స్పందించింది. ఖరీఫ్ సీజన్‌లో సరిపడా యూరియా తెలంగాణకు కేంద్రప్రభుత్వం ఇవ్వాలని రేవంత్‌రెడ్డి కోరారు. అయితే సీఎం విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రైతుల డిమాండ్‌ను నెరవేర్చే దిశగా అధికారులకు కేంద్రమంత్రి జేపీ నడ్డా ఆదేశాలు జారీ చేశారు. అవసరాలకు అనుగుణంగా యూరియా సరఫరా ఉండేలా చూసుకోవాలని ఎరువుల శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం ఢిల్లీలో జేపీ నడ్డా మీడియాతో మాట్లాడారు.

**అధిక వినియోగాన్ని తగ్గించేందుకు..**

రసాయన ఎరువులు అధికంగా వాడటంతో భూమిలోని సారం తగ్గిపోతోందని ముఖ్యమంత్రికి కేంద్ర మంత్రి జేపీ నడ్డా సూచించారు.

మిగతా 2లో

## సీసీఐ పునరుద్ధరించండి

**మూత బడిన పరిశ్రమల పునఃప్రారంభించాలి**

**పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు అందుతాయి**

**కేంద్ర మంత్రి కుమారస్వామిని కలిసిన శ్రీధర్ బాబు**



**ఢిల్లీ, మహా:** తెలంగాణ ఐటీ మంత్రి శ్రీధర్ బాబు బుధవారం కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామిని కలిశారు. ఈ సందర్భంగా పారిశ్రామిక రంగాన్ని మరింత అభివృద్ధి చేయడం, రాష్ట్ర యువతకు వృద్ధి చెందిన ఉపాధి అవకాశాలు కల్పించడం రాష్ట్ర అభివృద్ధి అజెండాలో ప్రధాన ప్రాధాన్యతలుగా ఉన్నాయని రాష్ట్ర పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా, ఆగిపోయిన కేంద్ర ప్రభుత్వ సంస్థలను పునరుద్ధరించడం

మిగతా 3లో

# బాధ్యులను ఉపేక్షించేది లేదు

**కల్తీ కల్లు ఘటనపై మంత్రి జూపల్లి సీరియస్**

- చికిత్స పొందుతున్న బాధితులకు పరామర్శ
- ఘటనలు పునరావృతం కావొద్దని అధికారులకు ఆదేశాలు
- కల్లు డిపోలను సీజ్ చేసిన ఎక్సైజ్ పోలీసులు



**హైదరాబాద్, మహా:** హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి హైదర్‌నగర్‌లో కల్తీ కల్లు కలకలం సృష్టించింది. కల్తీ కల్లు తాగి 19 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం ఈ ఘటన వెలుగు చూసింది. పరిస్థితి విషమించడంతో ఇవాళ ముగ్గురు మృతి చెందారు. నిమ్స్ ఆస్పత్రిలో ప్రస్తుతం 15 మంది చికిత్స పొందుతున్నారు. వీరిని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పరామర్శించారు. కల్తీ కల్లు తాగి పలువురు అస్వస్థతకు గురైన సంఘటన అత్యంత బాధాకరమని మంత్రి జూపల్లి చెప్పారు. బాధితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పినట్లు తెలిపారు.

మిగతా 2లో



### తిండికి ఎన్నో ఇబ్బందులు పడ్డా..

- ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చా
- కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎమోషనల్
- విద్యార్థులకు అతి త్వరలో 'మోదీ కిట్స్' అందజేస్తాం
- సైకిళ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టిన కేంద్ర మంత్రి

వివరాలు 2లో

**34 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు**
## ఎన్ఎంసీ గ్రీన్ సిగ్నల్

**4090 ఎంబీబీఎస్ సీట్లు యథాతథం**

**ప్యాకల్టీ కొరత అధిగమనకు తీసుకున్న చర్యలపై ప్రశంస**

వివరాలు 2లో

### హెచ్ సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావు అరెస్ట్

**టికెట్ల వివాదంతో పాటు తీవ్ర ఆరోపణలు**

03

### ప్రతిపక్షాల ఓట్లు తొలగించే కుట్ర

- మహారాష్ట్ర తరహాలో బిహార్‌లో ఓట్ల చోరీ
- కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు

03

### డొనాల్డ్ ట్రంప్‌ను చంపుతాం!

- ఇకపై సురక్షితంగా సన్ బాత్ చేయలేరు
- ఇరాన్ సుప్రీం లీడర్ సలహాదారు వార్నింగ్

03

## సభకు మీరు వస్తారా?

# ఎర్రవల్లి ఫామ్ హౌస్‌కి నన్ను రమ్మంటారా?

**హైదరాబాద్, మహా :**
మీ అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుంటాం.. మీ సూచనలు తెలంగాణకు ప్రయోజనం చేకూరుతాయంటే తీసుకుంటామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఓపెన్ ఆఫర్ ఇచ్చారు. కృష్ణా జలాల అంశంపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌కు సీఎం హాజరై మాట్లాడారు. కేసీఆర్...మీరు రండి. నిపుణులను పిలుస్తాం. మా డాక్యుమెంట్ సభలో పెడతాం. మీరు సూచన చేయండి.. అవసరం అనుకుంటే మార్చుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది.. ఎక్స్‌ఫర్ట్స్ ఒపీనియన్ కూడా సభలో వినిపిద్దామన్నారు. మీరు శాసనసభ సమావేశాలు పెట్టాలని ఎప్పుడు స్పీకర్ కు లేఖ రాసినా మేం సిద్ధమన్నారు. మీ హయాంలో, మా హయాంలో తీసుకున్న నిర్ణయాలపై చర్చ పెడదామన్నారు. సభా నాయకుడిగా నేను మాట ఇస్తున్నా...ఎలాంటి గందరగోళం లేకుండా.. ఎవరి గౌరవానికి భంగం కలగకుండా చూసుకునే బాధ్యత నాది కేసీఆర్ మీరు రండి..స్టేక్ హోల్డర్స్ ను పిలుద్దాం.. అర్థవంతమైన చర్చ పెడదామని రేవంత్ రెడ్డి కేసీఆర్‌కు సూచించారు.మీ ఆరోగ్యం సహకరించకపోతే.. తారీఖు చెప్పండి.. ఎర్రవల్లి ఫామ్ హౌస్ కు నేను మంత్రుల బృందాన్ని పంపుతా.. మాక్ అసెంబ్లీ నిర్వహిస్తాం... కాదు కూడదు నేనుకూడా రావాలంటే ఎర్రవల్లి ఫామ్ హౌస్ లో జరిగే ప్రజాప్రతినిధుల సమావేశానికి రావడానికి నేనుకూడా సిద్ధం.. వాస్తవాలను ప్రజలకు అందించడమే మా ఉద్దేశం అని స్పష్టం చేశారు. తెలంగాణ హక్కులను ఎవరికీ తాకట్టు పెట్టం.తెలంగాణ హక్కుల విషయంలో దేవుడు ఎదురొచ్చినా నిటారుగా నిలబడి పోరాడుతామని స్పష్టం చేశారు.



### మరణశాసనం రాసే హక్కు ఎవరిచ్చారు?

కేసీఆర్ హయాంలోనే ఏపీ కృష్ణా జలాల్లో నీటి దోపిడీ మొదలైంది. బీఆర్ఎస్ కృష్ణా ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసి ఉంటే నేడు ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదన్నారు. పదేళ్ళలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదు. తెలంగాణకు మరణశాసనం రాసింది కేసీఆరే. మరణ శాసనం రాసే హక్కు ఆయనకు ఎవరిచ్చారని రేవంత్ రెడ్డి నిలదీశారు. గతంలో చిన్నారెడ్డి మంచి సూచనలు చేస్తే, ఆయనను అవమానించారు. అహంకార పూరిత నిర్ణయంతో కృష్ణా జలాల్లో నేడు రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందని అన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల అంచనాలు భారీగా పెంచి కూడా పూర్తి చేయలేదని అన్నారు. కృష్ణా నీటిని రాయసీమకు వదిలేసే హక్కు కేసీఆర్ కు ఎవరిచ్చారని, ఆయన రాయలసీమకు పాలేగాడిగా మారారా అని అడుగుదామంటే అసెంబ్లీలో అడుగు పెట్టడం లేదన్నారు.జూరాల నుంచే నీళ్లు తెచ్చుకుంటే ఏపీ నీళ్లు కొల్లగొట్టే అవకాశం ఉండేది కాదని, కేసీఆర్ నిర్ణయాలు కృష్ణా పరివాహక రైతులకు మరణశాసనంగా మారాయని ఆరోపించారు. ప్రాజెక్టుల్లో తెలంగాణకు వాటా వస్తే తక్కువ ధరకు విద్యుత్ వచ్చేదని, శ్రీశైలం, సాగర్, పులిచింతలలో విద్యుదుత్పత్తిలో వాటా వస్తే తక్కువ ధరకు వచ్చేదని, బారానా, ఆఠానాకు దొరకాల్సిన విద్యుత్‌ను యూనిట్ రూ.10కి కొనే పరిస్థితి వచ్చిందన్నారు. గతంలో పాలమూరురంగారెడ్డి సామర్థ్యాన్ని ఒక టీఎంసీకి తగ్గించారని, ఏపీ 10 టీఎంసీలతో ప్రాజెక్టులు చేపడితే పాలమూరును ఒక టీఎంసీకి తగ్గించారని, ఏడాదికి కి.మీ టన్నెల్ పూర్తి చేసి ఉంటే ఎస్ఎల్‌బీసీ పూర్తయ్యేదని తెలిపారు. గతంలో రూ.వెయ్యి కోట్ల ప్రాజెక్టు అంచనా రూ.3 వేల కోట్లకు పెరిగిందని, 3.64 లక్షల ఎకరాలకు సాగునీరిచ్చే ఎస్ఎల్‌బీసీని పక్కనపెట్టారని, పాలమూరురంగారెడ్డి అంచనాలు పెంచినా పూర్తి చేయలేదని పేర్కొన్నారు. ఉమ్మడి ఏపీలో జరిగిన ద్రోహం కంటే వెయ్యి రెట్లు ఎక్కువ కేసీఆర్ చేశారని విమర్శించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ ఇన్ ఛార్జిలు, కార్పోరేషన్ ఛైర్మన్ లు పాల్గొన్నారు.

# కృష్ణా వాటాలో ద్రోహం చేసిందే కేసీఆర్

**.. పీపీటీలో ఉత్తమ్ ఫైర్**

**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ హయాంలోనే రాయలసీమకు కృష్ణానీటిని అక్రమంగా తరలించే ఏర్పాట్లు జరిగాయని రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు కేసీఆర్ సహకరించారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బచావత్ ట్రైబ్యునల్ తర్వాత కేంద్ర జలవనరుల సంఘం ఆమోదం లేకుండా ఉమ్మడి ఏపీలో అనేక ప్రాజెక్టుల పనులు మొదలు పెట్టారు. ఎస్ఎల్ బీసీ, కల్వకుర్తి, నెట్టెంపాడు, డిండి, పాలమూరు రంగారెడ్డి కోయిల్ సాగర్, బీమా వంటి ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. ఈ ప్రాజెక్టులను పూర్తి చేసి ఉంటే తెలంగాణకు కృష్ణాజలాల్లో పూర్తి న్యాయం జరిగేదని చెప్పారు. కృష్ణాజలాల మళ్లింపు, కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇవాళ హైదరాబాద్ లోని ప్రజాభవన్ లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజా ప్రతినిధులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ తో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి అల్మట్టి ప్రాజెక్టుపై ఉమ్మడి ఏపీ హయాంలో సుప్రీంకోర్టులో కేసు వేసిందని దాంతో 1976 లో చావత్ ట్రైబ్యునల్ 2130 టీఎంసీలను మూడు రాష్ట్రాలకు కేటాయించింది. ఉమ్మడి ఏపీకి 811, కర్ణాటకకు 734, మహారాష్ట్రకు 585 టీఎంసీలు కేటాయించిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. బచావత్ ట్రైబ్యునల్ బ్రిజేష్ ట్రిబ్యునల్ ఏర్పాటు అయిందని ఈ ట్రిబ్యునల్ తీర్పు వచ్చే వరకు కేసీఆర్ కృష్ణాజలాల్లో ఏపీకి 66 శాతం తెలంగాణకు 34 శాతం ఇవ్వాలని చెప్పి తెలంగాణకు తీరని ద్రోహం చేశారని ధ్వజమెత్తారు.

# చాన్స్ ఇస్తే జూబ్లీహిల్స్‌లో పోటీ చేస్తా!

- ఉప ఎన్నిక అభ్యర్థి ఎవరనేది అధిష్టానం ఇష్టం
- రాజాసింగ్ కంటే అప్పుడు నాకే ఓట్లు ఎక్కువొచ్చాయ్
- పార్టీ నుంచి ఎందుకు వెళ్లి పోయారో ఆయనకే తెల్వదు
- బీజేపీ నాయకురాలు మాధవి లతా కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** బీజేపీ నాయకురాలు మాధవి లతా ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పార్టీ వీడి ఎందుకు వెళ్లి పోయారో ఆయనకే తెలియదని సెటైర్లు వేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఓ మీడియాతో బీజేపీ నేత మాధవి లతా మాట్లాడుతూ.. మొన్నటి ఎన్నికల్లో తన తమ్ముడు రాజాసింగ్ కంటే తనకే ఎక్కువ ఓట్లు వచ్చాయని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల వేళ.. హైదరాబాద్ లోక్‌సభ అభ్యర్థిగా తనకు అధిష్టానం అవకాశం ఇస్తే.. ఆ రోజు పార్టీలో మగాళ్లు లేరా అని రాజాసింగ్ ప్రశ్నించారని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేసుకున్నారు. అయినా రాజాసింగ్ తన తమ్ముడేనని ఆమె స్పష్టం చేశారు.



**ప్రభుత్వానికి ఎందుకు భయం..?**

గోషామహల్ కాదు ప్రస్తుతం అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో తాను పర్యటిస్తున్నానన్నారు. తనకు ఒక్క గోషామహల్ నియోజకవర్గమే కాదని.. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు తన పరిధిలోనే ఉన్నాయని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అభ్యర్థి ఎవరనేది అధిష్టానం ఇష్టమన్నారు. తనకు అవకాశం ఇస్తే బరిలో ఉంటానని మాధవి లతా వెల్లడించారు.పేద ప్రజల ఇళ్లు కూలుస్తున్న హైడ్రా.. ఫాతిమా కాలేజీ విషయంలో ఎందుకు భయ పడుతుందో చెప్పాలంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆమె డిమాండ్ చేశారు. తన పార్లమెంట్ పరిధిలోని వేలాది మంది ప్రజలు రోడ్డున పడే పరిస్థితి నెలకుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఐఎం పార్టీ ఇచ్చే డబ్బుల మూటలతో ఈ ప్రభుత్వం నోరు కట్టేస్తుందని మండిపడ్డారు. దీనిపై త్వరలో తమ కార్యాచరణ ఉంటుందన్నారు.

**సీఎం రేవంత్ వినతికి స్పందించిన కేంద్రం**

# యూరియా కొరత ఉండొద్దు

**తెలంగాణకు సరిపడా ఎరువులు ఇస్తామని జేపీ నడ్డా వెల్లడి**

**పంపిణీ చేసేలా చూడాలని అధికారులకు కేంద్రమంత్రి ఆదేశాలు**

**(మొదటిపేజీ తరువాయి)**

202324 రబీతో పోలిస్తే 2024 25లో 21 శాతం అదనంగా యూరియా అమ్మకాలు జరిగాయని కేంద్ర మంత్రి వెల్లడించారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం ఇప్పటివరకు 12.4శాతం అదనపు వినియోగం జరిగిందని చెప్పుకొచ్చారు. వ్యవసాయేతర అవసరాలకు యూరియాను దారి మళ్లించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రసాయన ఎరువుల అధిక వినియోగాన్ని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ ఎరువులు, సేంద్రీయ సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి పీఎం ప్రణామ్ పథకం గురించి తెలంగాణ అధికారులకు కేంద్ర ఎరువుల శాఖ కార్యదర్శి రంజిత్ కుమార్ మిశ్రా వివరించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల మధ్య ఎరువుల సమన్వయాన్ని చేస్తూ రైతులకు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని అధికారులకు కేంద్రమంత్రి జేపీ నడ్డా ఆదేశించారు.

# రాజకీయాలు ఆస్వాదించడం లేదు

## కంగనా రనౌత్ సంచలన వ్యాఖ్యలు

- పంచాయతీ స్థాయి సమస్యలతో ప్రజలు నా వద్దకు వస్తున్నారు
- ప్రజాసేవ నేపథ్యం లేదు.. స్వార్థపూరిత జీవితం గడిపా
- ప్రధానమంత్రి పదవికి తాను తగిన వ్యక్తిని కానన్న కంగన

**మహా:** బాలీవుడ్ నటి కంగనా రనౌత్ రాజకీయాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో హిమాచల్ ప్రదేశ్‌లోని మండీ నుంచి బీజేపీ ఎంపీగా గెలిచిన ఆమె తన కొత్త పాత్రలో ఇమడలేకపోతున్నానని, రాజకీయ జీవితాన్ని తాను అనుకున్నంతగా ఆస్వాదించడం లేదని బహిరంగంగా అంగీకరించారు. ఇటీవల ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కంగన తన మనసులోని మాటను బయటపెట్టారు. రాజకీయాల్లోకి రావాలన్న ఆఫర్ రావడంతో ఒక ప్రయత్నంగా అడుగుపెట్టానని తెలిపారు. "రాజకీయాలను మీరు ఆస్వాదిస్తున్నారా?" అని అడగ్గా, "ఇప్పుడిప్పుడే అలవాటు పడుతున్నాను. కానీ దీన్ని ఆస్వాదిస్తున్నానని చెప్పలేను. ఇది చాలా భిన్నమైన పని, ఒక రకమైన ప్రజాసేవ లాంటిది. నాకు అలాంటి నేపథ్యం లేదు. ప్రజలకు సేవ చేయాలన్న ఆలోచన నాకు ఎప్పుడూ రాలేదు" అని ఆమె అన్నారు. క్షేత్రస్థాయిలో తనకు ఎదురవుతున్న అనుభవాలను పంచుకుంటూ "ఎక్కడో మురుగు కాలువ పగిలిపోతే నా దగ్గరకు వస్తున్నారు. నేను ఒక ఎంపీని, కానీ ప్రజలు పంచాయతీ స్థాయి సమస్యలతో నా వద్దకు వస్తున్నారు. అది రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని సమస్య అని చెప్పినా వారు వినరు. 'మీ దగ్గర డబ్బుంది కదా, మీ సొంత డబ్బుతో చేయండి' అని అడుగుతున్నారు" అంటూ తన అసహనాన్ని వ్యక్తం చేశారు.



**నేను అర్హురాలిని కాదు**

భవిష్యత్తులో ప్రధానమంత్రి కావాలనే ఆశ ఉందా అని ప్రశ్నించగా ఆ పదవికి తాను తగిన వ్యక్తిని కాదని కంగనా స్పష్టం చేశారు. "నాకు ప్రజాసేవ నేపథ్యం లేదు. నేను చాలా స్వార్థపూరితమైన జీవితాన్ని గడిపాను. కాబట్టి ఆ పదవికి నేను అర్హురాలిని కానని భావిస్తున్నాను" అని ఆమె నిజాయతీగా సమాధానమిచ్చారు.

# గుజరాత్‌లో ఒక్కసారిగా కుప్పకూలిన బ్రిడ్జి

**పది మంది మృతి.. విచారణకు సీఎం ఆదేశం**



**(మొదటిపేజీ తరువాయి)**

మరికొంత మంది కోసం ఎన్ డిఆర్ ఎఫ్ బలగాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయని తెలిపారు. వడోదరఆనంద్ పట్టణాలను కలిపే గంభీర వంతెన కూలటంతో ఆ రెండు పట్టణాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గుజరాత్ నుంచి సౌరాష్ట్రకు వెళ్లే వాహనాలకు ఈ వంతెన ప్రధాన మార్గంగా ఉంది. సరైన మరమ్మతులు లేకపోవడం వల్లే కూలిపోయిన వంతెన కూలిపోయిందని అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు.

**అధికారులకు సీఎం ఆదేశం**

ప్రమాదం విషయం తెలియగానే ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ అదికారులను అప్రమత్తం చేశారు. నిపుణులను సంఘటనా స్థలానికి పంపి వంతెన కూలిపోవడానికి గల కారణాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. కులిపోయిన వంతెనను 1985లో నిర్మించినట్లు మంత్రి రుషికేష్ పటేల్ పేర్కొన్నారు. అవసరమైనప్పుడు దాని నిర్వహణను ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 'ఈ ప్రమాదానికి గల కచ్చితమైన కారణాన్ని తెలుసుకుంటాం' అని ఆయన అన్నారు.

# తిండికి ఎన్నో ఇబ్బందులు పడ్డా..

**ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చా**

- కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎమోషనల్
- విద్యార్థులకు అతి త్వరలో మోదీ కిట్స్ అందజేస్తాం
- సైకిళ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టిన కేంద్ర మంత్రి

**కరీంనగర్, మహా:** కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ టెన్త్ చదివే విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేసే కార్యక్రమానికి హాజరయ్యారు. మొత్తం 20 వేల సైకిళ్లను స్వయంగా కొనుగోలు చేసిన బండి సంజయ్ వాటిని దశల వారీగా పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తొలుత కరీంనగర్ టౌన్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. ప్రజలకు నిరంతరం అండగా ఉంటూ సమాజానికి సేవ చేయాలనే మాలో ఎప్పటికప్పుడు స్పూర్తినింపిన నాయకుడు ప్రధాని నరేంద్రమోదీ అని అన్నారు. వారి బాటలో నడుస్తూ మాకు చేతనైనంత సాయం చేస్తున్నామన్నారు. ఈ సైకిళ్ల పంపిణీ ఆలోచన ఇచ్చిందే జిల్లా కలెక్టర్ అని.. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో బాలికలకు సైకిళ్లు ఇస్తే బాగుంటుందని కలెక్టర్ ప్రతిపాదించారని చెప్పారు. ఆ ఆలోచనతోనే ఈరోజు టెన్త్ విద్యార్థినీ, విద్యార్థులందరికీ సైకిళ్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఇవి ప్రభుత్వ నిధులు కావని.. అలా అని తాను కోట్లు ఖర్చు పెట్టేంత సంపన్నుడిని కాదన్నారు. తమ దగ్గరకు వచ్చిన కొందరు కార్పొరేట్ కంపెనీల యాజమానులను మీరు సంపాదించిన సొమ్ములో కొంత సీఎస్సార్ ఫండ్ కింద ఇవ్వాలని కోరితే వారు సానుకూలంగా స్పందించి ఆ నిధులు అందించారని.. వాటితో సైకిళ్లను కొని విద్యార్థులకు పంపిణీ చేస్తున్నానని తెలిపారు.



**త్వరలో 'మోదీ కిట్స్' అందజేస్తాం..**

'నేను కూడా చిన్నప్పటి నుండి మీలాగే పేదరికంలో పెరిగిన. ఇక్కడే కాపువాడలో పుట్టి పెరిగిన. తినడానికి ఇబ్బంది పడ్డ. మా తల్లిదండ్రులు మమ్మల్ని ఎంతో కష్టపడి చదివించారు. మీలాగే అనేక కష్టాలు పడ్డ. మీ అమ్మనాన్నల్లాగే మా అమ్మనాన్న కూడా వంట చేయడానికి, చదివించడానికి నానా కష్టాలు పడ్డవాళ్లే. కష్టపడి ఈ స్థాయికి వచ్చిన. కష్టాలు తెలిసిన వ్యక్తిని కాబట్టే మీరు పడుతున్న ఇబ్బందులు తెలుసుకుని సైకిళ్లను పంపిణీ చేస్తున్నా. జిల్లా కలెక్టర్ ఈ విషయంలో రోల్ మోడల్. ఒడిశా నుండి వచ్చి కష్టపడి పనిచేస్తూ మీ అందరికీ స్పూర్తిగా ఉన్నారు. పోలీస్ కమిషనర్ బీహార్ నుండి ఇక్కడికి వచ్చారు. ఆయన తండ్రి మిలటరీలో పనిచేశారు. క్రమశిక్షణతో ఎదిగి వచ్చారు. వీళ్లే కాదు.. మహాత్మాగాంధీ, అంబేద్కర్, మోదీ కూడా పేదరికం నుండి ఎదిగిన వాళ్లే. ముఖ్యంగా అంబేద్కర్ ఎన్ని కష్టాలు అనుభవించారో, అంటరానితనాన్ని ఎదుర్కొన్నారే మాటల్లో చెప్పలేం. ఇప్పుడు మీ కష్టాలను తీర్చడానికి మోదీ ఉన్నాడు. మా హయాంలో ఆదుకునే వాళ్లే లేరు. ఈరోజు మీకందిస్తున్న సైకిళ్లు మోదీ గిఫ్ట్. అతి త్వరలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అతి త్వరలో ''మోదీ కిట్స్''ను అందజేయబోతున్నాం. ఎన్ని వేల మంది ఉన్నా, ఎన్ని లక్ష ల మంది ఉన్నా వాళ్లందరికీ మోదీ కిట్స్‌ను అందిస్తా' అని అన్నారు.

# రాజకీయాల నుంచి రిటైర్ అయ్యాక

- వేదాలు, ఉపనిషత్తులు చదువుతా
- ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెడతా
- హోం శాఖ కన్నా సహకార శాఖే తనకు పెద్దది
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా

**హైదరాబాద్, మహా :** రాజకీయ జీవితం నుంచి విరమణ పొందిన తర్వాత తాను ఏమి చేయాలనుకుంటున్నారో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. తన భవిష్యత్ ప్రణాళికలను వెల్లడించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రజా జీవితానికి వీడ్కోలు పలికిన తర్వాత పూర్తి సమయం వేదాలు, ఉపనిషత్తుల అధ్యయనానికి కేటాయిస్తానని తెలిపారు. దీనితో పాటు ప్రకృతి వ్యవసాయంపై కూడా దృష్టి సారిస్తానని చెప్పారు. గుజరాత్, మధ్య ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన సహకార సంఘాల మహిళలతో మాట్లాడుతూ ఆయన ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రసాయన ఎరువులతో పండించే పంటల వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని, అనేక రకాల అనారోగ్య సమస్యలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి సేద్యం ద్వారా శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని, అదే సమయంలో వ్యవసాయ ఉత్పాదకతను కూడా పెంచవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సహకార శాఖ మంత్రిగా తన బాధ్యతల గురించి కూడా అమిత్ షా మాట్లాడారు. తనకు హోం శాఖ అప్పగించినప్పుడు అందరూ అది కీలక శాఖ అన్నారని, కానీ సహకార శాఖ బాధ్యతలు స్వీకరించినప్పుడు హోం శాఖ కన్నా అదే పెద్ద శాఖ అని తాను భావించానని అన్నారు. దేశంలోని రైతులు, పేదలు, గ్రామాల సంక్షేమం కోసం ఈ శాఖ పనిచేస్తుండటమే దీనికి కారణమని ఆయన వివరించారు.

## 34 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు

# ఎన్ఎంసీ గ్రీన్ సిగ్నల్

**4090 ఎంబీబీఎస్ సీట్లు యథాతథం**

**ప్యాకల్టీ కొరత అధిగమనకు తీసుకున్న చర్యలపై ప్రశంస**

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలోని 34 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్ఎంసీ ఒక్క కాలేజీకి కూడా జరిమానా విధించలేదు. 4090 ఎంబీబీఎస్ సీట్లు యథావిధిగా కొనసాగనున్నాయి. పైగా ఫ్యాకల్టీ కొరతను అధిగమిస్తున్న విధానాన్ని ఎన్ఎంసీ ప్రశంసించింది. రాష్ట్ర ప్రభుత్వం ఫ్యాకల్టీ కొరతను అధిగమించేందుకు టీచింగ్ ఫ్యాకల్టీకి పెద్ద సంఖ్యలో ప్రమోషన్లు ఇచ్చింది. 44 మంది సీనియర్ ప్రొఫెసర్లకు, అడిషనల్ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లుగా ప్రమోషన్లు కల్పించింది.. వారందరికీ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రిన్సిపాల్స్‌గా, టీచింగ్ హాస్పిటల్లకు సూపరింటెండెంట్లుగా నియమించింది. అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న 278 మందికి, ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించింది. ఈ ప్రమోషన్లతో అన్ని కాలేజీల్లో ప్రొఫెసర్ల కొరత, డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీల సమస్య తీరనుంది. అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పని చేస్తున్న సుమారు 231 మంది అసోసియేట్ ప్రొఫెసర్లుగా ప్రమోషన్లు ఇచ్చేందుకు ఆరోగ్యశాఖ చర్యలు ప్రారంభించింది. అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్, అడిషనల్ డీఎంఈ వంటి పోస్టులను నేరుగా రిక్రూట్ చేసుకునే అవకాశం లేకపోవడంతో, ప్రమోషన్ల ద్వారా ఈ పోస్టులను భర్తీ చేయనుంది. 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను నేరుగా భర్తీ చేసేందుకు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఇటీవలే నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఇవిగాక సుమారు మరో 714 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. ఈ అంశాలన్నీ మెడికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ అధికారులు ఎన్ఎంసీకి వివరించారు. దీంతో ఎన్ఎంసీ సంతృప్తి వ్యక్తం చేసింది. కొన్ని టీచింగ్ హాస్పిటళ్లలో బెడ్ల సంఖ్య తక్కువగా ఉందని ఎన్ఎంసీ లేవనెత్తింది. ఈ నేపథ్యంలో 21 టీచింగ్ హాస్పిటల్స్‌లో కలిపి సుమారు 6 వేలకుపైగా బెడ్లను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. ప్రతి కాలేజీ పర్యవేక్షణకు *మెడికల్ కాలేజీ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ)లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీలు అన్ని కాలేజీల్లో పర్యటించి, కాలేజీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. రాష్ట్రంలో 2022 నుంచి 2024 మధ్యలో ఒకేసారి 25 కాలేజీలు ఏర్పాటైన తీరును ఎన్ఎంసీకి అధికారులు వివరించారు. అన్ని కాలేజీలు, వాటి అనుబంధ టీచింగ్ హాస్పిటళ్లకు భవనాలను నిర్మిస్తున్న విషయాన్ని ఎన్ఎంసీ తెలియజేశారు. భవన నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన ఎన్ఎంసీ, అన్ని పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసుకుని.. విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించింది. 4 నెలల్లో పూర్తిస్థాయిలో అన్ని సమస్యలను పరిష్కరించుకోవాలని ఎన్ఎంసీ సూచించింది. ఈ మేరకు అన్ని కాలేజీలకూ పర్మిషన్లను యథావిధిగా కొనసాగిస్తున్నట్టు స్పష్టం చేసింది. మరోవైపు, ఎంబీబీఎస్ కౌన్సిలింగ్ ప్రక్రియను ప్రారంభించేందుకు కాళోజీ హెల్త్ యూనివర్సిటీ సిద్ధమవుతోంది. త్వరలోనే నీట్ స్టేట్ ర్యాంకులను విడుదల చేయనున్నారు. ఆ తర్వాత, మెడికల్ కౌన్సిలింగ్ కమిటీ షెడ్యూల్ ప్రకారం కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభించనున్నారు.

# బాధ్యులను ఉపేక్షించేది లేదు

**(మొదటిపేజీ తరువాయి)**

వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నానని, బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు ఓ ప్రకటన ద్వారా వెల్లడించారు.

**మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు..**

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే.. బాధ్యులెంతటి వారైనా వదిలేదు లేదని, బాధ్యులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని మంత్రి వెల్లడించారు. కల్లు డిపోలను కూడా సీజ్ చేశామని, కల్లు నమూనాలను సేకరించి ఎక్సైజ్ కెమికల్ ల్యాబోరేటరీకి.. చికిత్స పొందుతున్న వారి నమూనాలను ఫోరెన్సిక్ ల్యాబ్ కు పంపించినట్లు తెలిపారు. నివేదిక ఆధారంగా బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవడంతో పాటు కల్లు డిపోల లైసెన్స్ రద్దు చేస్తామని ప్రకటించారు. భవిష్యత్ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని, ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి కల్లు డిపోలపై నిరంతర నిఘా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చామని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు.



# సీసీఐ పునరుద్ధరించండి



(మొదటిపేజీ తరువాయి)

అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, భద్రాద్రి కొత్తగూడెంలోని సింగరేణి ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ వంటి కేంద్ర యూనిట్ల పునరుద్ధరణ ద్వారా సమతుల్య ప్రాంతీయ అభివృద్ధి సాధ్యమవుతుందని, స్థానికులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు అందుతాయని మంత్రి స్పష్టం చేశారు.

**పారిశ్రామిక రంగానికి భారీ తోడ్పాటు..**

ఈ అంశంపై కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి హెచ్.డి. కుమారస్వామితో మంత్రి శ్రీధర్ బాబు సమావేశమై చర్చించారు. నిలిచిపోయిన యూనిట్ల పునరుద్ధరణ వల్ల రాష్ట్రానికి వచ్చే లాభాలను వివరిస్తూ, వెంటనే తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ ను రూ.5000 కోట్లతో పునరుద్ధరించిన ఘన విజయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తూ, అదే విధంగా సీసీఐ, ఎస్ఐఐఎల్ యూనిట్లను తిరిగి కార్యరూపంలోకి తేవడం ద్వారా తెలంగాణ పారిశ్రామిక రంగానికి భారీ తోడ్పాటు లభిస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రయత్నాల వల్ల ఆయా ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయని, ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది ఉద్యోగాలు అందుతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఈ ప్రాజెక్టులు త్వరితగతిన ముందుకు సాగాలని తెలంగాణ ప్రజలు ఆశిస్తున్నారు.

# ఏఎంవీఐల పాసింగ్ ఔట్ పరేడ్

## రవాణా శాఖలో పోస్టుల భర్తీపై పొన్నం కీలక వ్యాఖ్యలు

### ట్రాఫిక్ నిబంధనలపై మరింత అవగాహన కల్పించాలి.. యాక్సిడెంట్ డెత్ రేట్ తగ్గించాలి



**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి రవాణా శాఖలో పలు కీలక పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుందని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. బుధవారం తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసిన 96 మంది అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల (ఏఎంవీఐ) పాసింగ్ ఔట్ పరేడ్ కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏవీఎంఐల గౌరవ వందనం స్వీకరించి శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఏవీఎంఐలకు అవార్డులు ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడిన పొన్నం.. నాలుగు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న ఏఎంవీఐలకు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడిన ప్రజా పాలన ప్రభుత్వంలో అనేక ప్రజాయుత కార్యక్రమాలు తెచ్చిందని దాంతో తెలంగాణ రవాణా శాఖ ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. పోలీస్ అకాడమీలో ప్రత్యేక శిక్షణ తీసుకున్న ఏఎంవీఐలు రోడ్డు ప్రమాదాలు నివారించడానికి మీ శక్తి ఉపయోగించాలని యాక్సిడెంట్ లో డెత్ రేట్ తగ్గించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడంతో పాటు ట్రాఫిక్ ఉల్లంఘన చేస్తున్న వారిపై ఎన్ ఫోర్స్ మెంట్ చేస్తూ కఠినంగా వ్యవహరించాలని సూచించారు. రవాణా శాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తీసుకొచ్చి వెహికిల్ ఫిట్నెస్ చేస్తున్నామని మంత్రి చెప్పారు. మీరంతా రవాణా శాఖలోకి రావడం వల్ల ఈ డిపార్ట్ మెంట్ మరింత పటిష్టం అయిందన్నారు. దేశ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలలో గాయపడితే క్యాష్ లెస్ ట్రీట్మెంట్ విధానం కేంద్రం తీసుకొచ్చింది. రోడ్డు ప్రమాదాలు నివారించేలా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే విధుల్లో ఉన్న 300కి పైగా సిబ్బందికి రెండు నెలల చొప్పున శిక్షణ ఇవ్వాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో ఈవీ, సీఎన్జీ, ఎల్పీజీ వాహనాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి చెప్పారు. దేశంలో రవాణా శాఖలో నియామకం అవుతున్న వారందరికీ మీరు రోల్ మోడల్ గా ఉండాలని జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుని విధంగా మంచి పేరు తెచ్చుకుంటూ తల్లితండ్రులతో పాటు మీ గ్రామాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

# హెచ్ సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావు అరెస్ట్

## టికెట్ల వివాదంతో పాటు తీవ్ర ఆరోపణలు





**హైదరాబాద్, మహా :** ఎస్ఆర్‌హెచ్, హెచ్‌సీఏ వివాదంలో బిగ్ ట్విస్ట్ నెలకొంది. హెచ్‌సీఏ ప్రెసిడెంట్‌తో పాటు బోర్డులోని పలువురు సభ్యులను సీఐడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గత ఐపీఎల్ మ్యాచుల సందర్భంగా ఎస్ఆర్‌హెచ్ హెచ్‌సీఏ మధ్య టికెట్ల వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. మ్యాచ్ సందర్భంగా టికెట్స్ కేటాయించలేదని ఆరోపిస్తూ కార్పొరేట్ బాక్స్ కు తాళం వేసింది హెచ్‌సీఏ. ఈ ఘటనతో తీవ్ర అసహనానికి గురైన ఎస్ఆర్ హెచ్ యాజమాన్యం హైదరాబాద్ వదిలి పోతామని వెల్లడించింది. దీంతో జోక్యం చేసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనపై విజిలెన్స్ ఎంక్వయిరీకి ఆదేశించింది.ష టికెట్ల కోసం హెచ్‌సీఏ ప్రెసిడెంట్, ఎస్ఆర్‌హెచ్ ఫ్రాంఛైజీపై ఒత్తిడి తీసుకొని వచ్చినట్లు విజిలెన్స్ అధికారులు నిర్ధారించారు. టికెట్ల కోసం ఎస్ఆర్‌హెచ్ యజమాన్యాన్ని ఇబ్బందులకు గురి చేసినట్లు నిర్ధారణ అయ్యింది. ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం 10 శాతం టికెట్లను హెచ్‌సీఏకు ఫ్రీగా ఇస్తోంది. మరో 10 శాతం టికెట్లు కావాలని యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చినట్లు విజిలెన్స్ నివేదికలో బట్టబయలైంది.


ఫ్రీగా 10 శాతం టికెట్లు ఇచ్చే ప్రసక్తి లేదని ఎస్ఆర్‌హెచ్ తేల్చి చెప్పింది. ఓపెన్ మార్కెట్ లో కొనుగోలు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని జగన్మోహన్ రావు డిమాండ్ చేశారు. హెచ్‌సీఏ ద్వారా రిక్వెస్ట్ పెడితే టికెట్లు ఇచ్చేందుకు ఎస్ఆర్‌హెచ్ ఒప్పుకుంది. తనకు వ్యక్తిగతంగా 10 శాతం టికెట్లు కావాలని జగన్మోహన్ డిమాండ్ చేశారు. ఇలా 30 శాతం టిక్కెట్లు కావాలంటూ సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను జగన్మోహన్ రావు బెదిరించినట్లు తేలింది. వ్యక్తిగతంగా టికెట్లు ఇచ్చే ప్రసక్తి లేదని ఎస్ఆర్‌హెచ్ తేల్చి చెప్పింది. టికెట్లు ఇవ్వకపోవడంతో మ్యాచ్ ల సందర్భంగా ఇబ్బందులకు గురిచేశారు. లక్నో మ్యాచ్ సందర్భంగా వీఐపీ గ్యాలరీలకు తాళాలు వేశారు. యాజమాన్యాన్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేసినట్లు విజిలెన్స్ నివేదికలో నిర్ధారణ అయ్యింది. దీంతో హెచ్‌సీఏపై చర్యలకు విజిలెన్స్ సిఫారసు చేసింది.

ఉప్పల్ స్టేడియంలో మొత్తం 37 వేల మంది వీక్షకులు కూర్చునేందుకు సిట్టింగ్ కెపాసిటీ ఉంది. అందులో 10 శాతం టికెట్లు కాంప్లిమెంటరీ రూపంలో హెచ్‌సీఏకు ఇస్తుంది. ఇవి సరిపోవని, ఇరో 10 సాతం అధనంగా ఫ్రీ టికెట్లు ఇవ్వాలని కోరడంతో పాటు హెచ్ సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావు తనకు సపరేటుగా మరో 10 సాతం టికెట్లు ఇవ్వాలని కోరినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలన్నింటిపై విజిలెన్స్ కమిషన్ దరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సభ్యులను సైతం విచారించింది. అందులో హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావు ప్రమేయం ఉందనే విషయం బహిర్గతమైంది. విజిలెన్స్ నివేదిక ఆధారంగా సీఐడీ పోలీసులు కేసును నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఆయనతోపాటు పలువురిని సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు.

# కొత్త వైన్ పరిశ్రమ

## వైన్ వినియోగం నానాటికీ పెరుగుదల

- ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్న 3 సంస్థలు
- ప్రభుత్వ పరిశీలనలో ఫైల్
- ఒక సంస్థకు అనుమతి
- ఈ ఏడాది జూన్ కల్లా 2.68 లక్షల వైన్ కేసుల విక్రయం
- అందులో 8,725 కేసులు మాత్రమే స్థానిక కంపెనీలవి
- హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో 700 ఎకరాలకు పైగా ద్రాక్షసాగు.. అక్కడేవైనరీ పరిశ్రమల స్థాపనకు చర్యలు



**హైదరాబాద్, మహా :** తెలంగాణలో త్వరలో కొత్త వైన్ పరిశ్రమ రానుంది. రాష్ట్రంలో వైన్ వినియోగం నానాటికీ పెరుగుతున్నప్పటికీ.. స్థానిక కంపెనీలు తక్కువగా ఉన్నందున హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. కొత్త వైనరీల ఏర్పాటుకు మూడు సంస్థలు దరఖాస్తు చేసుకోగా.. వాటిలో ఒకదానికి అనుమతి ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్రంలో వైన్ విక్రయాలను పరిశీలిస్తే.. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో (జనవరిజూన్) రూ.300 కోట్ల విలువైన అమ్మకాలు జరిగాయి. మొత్తం 2,67,245 కార్టన్ల వైన్ విక్రయిస్తే.. అందులో కేవలం 8,725 కేసులు మాత్రమే స్థానిక కంపెనీలవి. ఈనేపథ్యంలో ఎక్సైజ్‌శాఖ వైనరీ పరిశ్రమ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపింది. నాలుగు రోజుల క్రితం వైన్ తయారీ పరిశ్రమ ఏర్పాటుపై మంత్రి జూపల్లి సమక్షంలో ఉన్నతాధికారులతో సమావేశం జరిగినట్లు తెలిసింది. ఎక్సైజ్ శాఖ పంపిన నివేదికను పరిశీలించాక..వైనరీ ఏర్పాటుకు త్వరలోనే ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

**ఇవీ లెక్కలు..**

రాష్ట్రంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో ఏడాదికి 8 లక్షల బల్క్ లీటర్ల సామర్థ్యం కలిగిన ఒకే ఒక వైన్ తయారీ పరిశ్రమ ఉంది. అయితే.. ఏటా స్థానికంగా పెరుగుతున్న వైన్ వినియోగానికి తగ్గట్లుగా రాష్ట్రంలో వైన్ ఉత్పత్తి కావడంలేదు. ఎక్సైజ్‌శాఖ లెక్కల ప్రకారం.. 202122లో వైన్ విక్రయాల ద్వారా రూ.201 కోట్ల విలువైన 1.87లక్షల వైన్ కేసులు (ఒక కేసు అంటే లీటర్ బాటిళ్లు 12) విక్రయించగా ఇందులో కేవలం 16,205 కేసులు మాత్రమే స్థానికంగా తయారయ్యాయి. మిగిలిన సరుకంతా విదేశాల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకున్నదే. ఇక 202223లో 2.35 లక్షల కేసులు (రూ.260 కోట్లు).. 202324లో 2.41 లక్షల వైన్ కేసులు (రూ.275 కోట్లు) అమ్ముడయ్యాయి. ఈ ఏడాదిలో వైన్ వినియోగం భారీగా పెరిగింది. రాష్ట్రంలోనే వైన్ తయారీ పరిశ్రమలు స్థాపిస్తే.. వైన్ ఉత్పత్తి పెరగడమేకాకుండా స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని, ప్రభుత్వానికి ఆదాయం కూడా పెరుగుతోందని అబ్కారీ శాఖ అధికారులు భావిస్తున్నారు. ద్రాక్ష, ఆపిల్, అరటి, ఉసిరి, పైనాపిల్ వంటి పండ్లతో వైన్ తయారీకి అవకాశం ఉండటంతో భవిష్యత్తులో ఆయా పండ్ల తోటల సాగు విస్తీర్ణం కూడా పెరుగుతుందని అంచనా. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు కేంద్రం భారీగా రాయితీలు ఇస్తుండటంతో వైన్ తయారీపరిశ్రమల ఏర్పాటుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో 700ఎకరాలకు పైగా దాక్షతోటలు ఉండటంతో ఆ ప్రాంతాన్ని.. కొత్తగా వైన్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసుకునేందుకు అనువైనదిగా ఎక్సైజ్‌శాఖ ఇప్పటికే గుర్తించింది. కొత్తగా వైనరీని స్థాపించడానికి ఆసక్తి కలిగిన పారిశ్రామికవేత్తల నుంచిదరఖాస్తులు కోరింది. దీంతో బ్లూసీల్, ఈరియా, బగ్గా కంపెనీలు ఆసక్తి చూపుతూ దరఖాస్తు చేశాయి. దీనిపై ప్రభుత్వం పరిశీలించిన తర్వాత.. త్వరలోనే ఒక వైన్ తయారీ పరిశ్రమకు ఆమోదం లభించనుంది.

# పోలీస్ అభ్యర్థులపై కేసు చెల్లదు

## నిరసనకారులపై ఎఫ్ఐఆర్ కొట్టేసిన హైకోర్టు

**హైదరాబాద్, మహా :** పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ నిరసన చేపట్టిన అభ్యర్థులపై బంజారాహిల్స్ పోలీసులు నమోదు చేసిన క్రిమినల్ కేసు చెల్లదని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో కోర్టును ఆశ్రయించిన 10 మందికి ఊరటనిస్తూ వారిపై ఎఫ్ఐఆర్‌ను కొట్టేసింది. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) వద్ద ఆందోళనకు దిగినందుకు బంజారాహిల్స్ పోలీసులు 2023 ఫిబ్రవరి 3న 16 మందిపై కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసును కొట్టేయాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌కు చెందిన కొంగరి మహేశ్ సహా పలువురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. ఐసీసీసీ భవనం సమీపంలో 16 మంది చట్టవిరుద్ధంగా సమావేశమై అనుమతి లేకుండా ప్రాంగణంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించారని ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపించారు. రోడ్డుపై నినాదాలు చేస్తూ ట్రాఫిక్‌ను అడ్డుకున్నారన్నారు. అందువల్ల దర్యాప్తును కొనసాగించేలా పిటిషన్‌ను కొట్టేయాలని కోరారు. అనంతరం పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదిస్తూ పరుగు పందెం, లాంగ్ జంప్, షాట్‌పుట్ విభాగాల్లో అప్పటి వరకు ఉన్న కొలతలను మార్చి, పెంచారని ఆరోపిస్తూ శాంతియుతంగా అభ్యర్థులు నిరసనకు దిగారన్నారు. వారు చట్ట ఉల్లంఘనకు పాల్పడలేదని పోలీసులు తప్ప స్వతంత్రులెవరూ సాక్షులుగా వాంగ్మూలం ఇవ్వలేదని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఇది చట్ట ప్రక్రియను దుర్వినియోగం చేయడమేనని పేర్కొంటూ 10 మంది పిటిషనర్లపై కేసును రద్దు చేస్తూ తీర్పునిచ్చారు. అయితే పిటిషనర్లకు మాత్రమే ఈ ఊరట లభిస్తుందని, మిగతా వారిపై దర్యాప్తు కొనసాగుతుందని స్పష్టం చేశారు.



# ప్రతిపక్షాల ఓట్లు తొలగించే కుట్ర

- మహారాష్ట్ర తరహాలో బిహార్‌లో ఓట్ల చోరీ
- కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు

**బిహార్, మహా:** బిహార్‌లో ప్రతిపక్షాల ఓట్లను తొలగించే కుట్ర చేస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. మహారాష్ట్ర తరహాలో నీతీశ్‌కుమార్ పార్టీ తమకు అనుకూలమైన వారి ఓట్లు మాత్రమే జాబితాలో ఉండేలా మార్పులు చేస్తోందని విమర్శించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను నిర్వహించాలన్న ఎన్నికల సంఘం నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు చేపట్టిన 'బిహార్ బంద్'లో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభకు, మహారాష్ట్రలో జరిగిన ఎన్నికల్లో ముందుగా ఇండియా కూటమికి మెజారిటీ ఉన్నట్లు పలు సర్వేలు వెల్లడించాయని రాహుల్ పేర్కొన్నారు. కానీ అనుకోని విధంగా తాము ఆయా ఎన్నికల్లో ఓడిపోయామన్నారు. అనంతరం ఓటర్ల జాబితాను పరిశీలిస్తే ఎన్నికలకు వారం రోజుల ముందు దాదాపు కోటి మంది కొత్త ఓటర్లను చేర్చినట్లు గుర్తించామన్నారు. అలా కొత్త ఓటర్లను చేర్చిన అన్ని నియోజకవర్గాల్లో బీజేపీ గెలుపొందిందని ఆరోపించారు. బిహార్‌లోనూ అదే కుట్ర పన్నుతున్నారని అన్నారు.

# డొనాల్డ్ ట్రంప్‌ను చంపుతాం!


- ఇకపై సురక్షితంగా సన్ బాత్ చేయలేరు
- ఇరాన్ సుప్రీం లీడర్ సలహాదారు వార్నింగ్

**ఇంటర్నెట్ డెస్క్, మహా:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను చంపుతామని ఇరాన్ నుంచి బెదిరింపులు వచ్చాయి. స్వయంగా ఇరాన్ సుప్రీం లీడర్ సలహాదారు ఈ బెదిరింపులకు పాల్పడటం సంచలనంగా మారింది. డొనాల్డ్ ట్రంప్ తన విలాసవంతమైన ఫ్లోరిడా ఇంట్లో ఇకపై సురక్షితంగా సన్ బాత్ చేయలేరని హెచ్చరించారు. ఇరాన్, యూఎస్ మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న సంఘర్షణలో ఈ హత్య బెదిరింపులు కొత్త దశను సూచిస్తున్నాయి. ఇరాన్‌కు చెందిన సీనియర్ అధికారి డోనాల్డ్ ట్రంప్‌ను ఫ్లోరిడాలోని మార్ ఎ లాగోలో హత్య చేస్తామని బెదిరించారు. ఇరాన్ సుప్రీం లీడర్ సలహాదారు జవాద్ లారిజాని ఇరాన్ టెలివిజన్‌లో చేసిన వ్యాఖ్యల్లో డోనాల్డ్ ట్రంప్ తన విలాసవంతమైన ఫ్లోరిడా ఇంట్లో ఇకపై సురక్షితంగా సన్ బాత్ చేయలేరని హెచ్చరించారు. 'ట్రంప్ చేసిన పని వలన అతను మార్‌ఎలాగోలో ఇకపై సన్ బాత్ చేయలేడు..అతను తన పొట్టను సూర్యుడికి పెట్టి అక్కడ పడుకున్నప్పుడు.. ఒక చిన్న డ్రోన్ అతని బొడ్డులో తగలొచ్చు. ఇది చాలా సులభమే' అని సీనియర్ అధికారి చెప్పడం సంచలనంగా మారింది.

# పాలనలో వైఫల్యం చెందిన రేవంత్

## కప్పిపుచ్చుకునేందుకు ఢిల్లీ టూర్ లు.. ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు

## బీజేపీయే ప్రత్యామ్నాయమని భావిస్తున్న ప్రజలు.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



**హైదరాబాద్, మహా :** కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజా విశ్వాసాన్ని కోల్పోయాయని, ఈ రెండు పార్టీలు ప్రజలకిచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో ఘోర వైఫల్యం చెందాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలోని గజ్వేల్ పట్టణానికి చెందిన మాజీ మునిసిపల్ ఛైర్మన్, మాజీ కౌన్సిలర్లతో పాటు పలువురు ఎంపీ రఘునందన్ రావు సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ, రెండు పార్టీల పాలన చూసిన ప్రజలు ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలం పూర్తయినా వృద్ధాప్య, వితంతు పెన్షన్లను మంజూరు చేయడం లేదని, నిత్యం బీజేపీ కార్యాలయానికి చాలామంది దివ్యాంగులు, వృద్ధులు వస్తున్నారన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల పట్ల చూపుతున్న నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలోని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెండింగ్‌లో ఉన్న పెన్షన్లను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాస్తున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే రైతు భరోసా పేరుతో కొంతమందికి మాత్రమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం డబ్బులు విడుదల చేసిందన్నారు. భద్రాచలంలో ఈవోపై దాడి చేయడం, దేవస్థానం భూములను ఆక్రమించే ప్రయత్నం చేయడం జరిగిన ఘటన బాధాకరమని, ఇతర మతస్తులు ఆ భూముల్లో కట్టడాలు కట్టి, కొందరు చర్చ్‌లు, మసీదులు నిర్మించేందుకు యత్నిస్తున్నారన్నారు. వీటిని ఈవో ఆపే ప్రయత్నం చేయగా, ఆమెపై దాడి జరిగిందని, ఇది భద్రాచలంలోనే కాదు,తిరుమల తిరుపతి దేవస్థానం భూముల విషయంలో కూడా జరిగిందన్నారు. ఖమ్మం ప్రాంతంలో కొన్ని రాజకీయ పార్టీల ప్రోత్సాహంతో టీటీడీకి చెందిన భూముల్లో గోడలు కూలగొట్టి, ఇతర మతస్తులు మసీదులు, ఇతర కట్టడాలు నిర్మించారని, టీటీడీ అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించకుండా అడ్డుకున్నారన్నారు. హిందూ దేవాలయ భూములను ఇతర మతస్తుల ఆక్రమణ నుంచి రక్షించుకోవాల్సిన అవసరం ఉందని, బీజేపీ ఆధ్వర్యంలో దేవాలయ భూముల పరిరక్షణ కోసం ఉద్యమం చేస్తామని వెల్లడించారు. ఖమ్మంలో ఆక్రమించిన భూముల నుంచి ఆక్రమణదారులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఖాళీ చేయించాలని, ఈవోపై దాడి చేసిన ఇతర మతస్తులు, దేవాలయ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పదే పదే ఢిల్లీకి వెళ్తూ తన పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి బీజేపీపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను, ఇతర హామీలను ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. తెలంగాణ రాష్ట్రానికి మంచి భవిష్యత్తు బీజేపీ మాత్రమే అందించగలదని, అందువల్ల రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ప్రజలు పార్టీలో చేరాలని పిలుపునిచ్చారు. ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ, నేను కొట్టినట్లు చేస్తా, నువ్వు ఏడ్చినట్లు చెయ్ అనే విధంగా బీఆర్ఎస్ - కాంగ్రెస్ పార్టీలు నాటకాలు ఆడుతున్నాయని విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు వివిధ అంశాలపై చర్చల పేరుతో చేసుకుంటున్న సవాళ్లు, ప్రతిసవాళ్ల పంచాయితీ రాజకీయ నాటకంలో భాగమేనని అన్నారు. ఈ నాటకాన్ని తెలంగాణ ప్రజలు స్పష్టంగా అర్థం చేసుకోవాలన్నారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన వేదిక శాసన సభ లేదా పార్లమెంట్ అని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి పార్లమెంటులో ప్రాతినిధ్యం లేకపోవడం, మా మెదక్ పార్లమెంట్ ప్రజల ఘన విజయం, గర్వకారణమన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చరమగీతం పాడే కార్యక్రమాన్ని దుబ్బాకలో బీజేపీ కార్యకర్తలు మొదటగా ప్రారంభించారని, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం నుండి బీఆర్ఎస్‌ను ఓడించారన్నారు. గజ్వేల్, సిద్దిపేట లాంటి తమ గడపలుగా చెప్పుకునే నియోజకవర్గాలు మెదక్, గజ్వేల్ అని అన్నారు. పార్టీలో చేరిన వారిలో గజ్వేల్ మాజీ మున్సిపల్ ఛైర్మన్ భాస్కర్, తాజా మాజీ కౌన్సిలర్లు సుభాష్ చంద్రబోస్, రామచంద్రాచారి, జి. నర్సింహులు, దాస్, యూత్ ప్రెసిడెంట్ అనూప్, పద్మశాలి సంఘం అధ్యక్షులు ఆరెపు బాలచంద్రన్, కాంగ్రెస్ ఐటీ సెల్ అధ్యక్షులు బలరాం, విశ్వకర్మ సంఘం అధ్యక్షులు మురళీ, మున్నూరుకాపు సమాజం అధ్యక్షులు ఐల కృష్ణ తదితరులున్నారు.

# ఓవైసీ కాలేజీని అందుకే కూల్చలేదు

## పాతబస్తీ సూరం చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఒవైసీ ఫాతిమా కాలేజీ

### 10 వేల మందికి పైగా పేద ముస్లిం యువతులు చదువుకుంటున్నారన్న రంగనాథ్ మానవతా దృక్పథంతో కూల్చివేత చర్యలను నిలిపివేశామని వెల్లడి





**హైదరాబాద్, మహా :** పాతబస్తీలోని సూరం చెరువు పరిరక్షిత ప్రాంతంలో (ఎఫ్‌టీఎల్) ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ నిర్మించిన ఫాతిమా కాలేజీ కూల్చివేతకు సంబంధించి వెల్లువెత్తుతున్న విమర్శలపై ఎట్టకేలకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టత ఇచ్చారు. సామాన్యుల నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు, ఒవైసీ కాలేజీ విషయంలో ఎందుకు మినహాయింపు ఇస్తున్నారని వస్తున్న ప్రశ్నలకు ఆయన వివరణ ఇచ్చారు. ఈ విషయంపై ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ... "ఫాతిమా కాలేజీని ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించినందున గత ఏడాది సెప్టెంబర్‌లోనే కూల్చివేసేందుకు ప్రయత్నించాం. అయితే, ఆ కాలేజీలో 10,000 మందికి పైగా పేద ముస్లిం బాలికలు, యువతులు కేజీ నుంచి పీజీ వరకు ఎలాంటి ఫీజులు లేకుండా ఉచితంగా విద్యనభ్యసిస్తున్నారని మా దృష్టికి వచ్చింది" అని తెలిపారు. పేద ముస్లిం మహిళల అభ్యున్నతికి ఈ విద్యాసంస్థ ఎంతో దోహదపడుతోందని ఆయన అన్నారు. ఒక సామాజిక ప్రయోజనం కోసం నడుస్తున్న సంస్థ కావడంతోనే మానవతా దృక్పథంతో ఆలోచించి కూల్చివేత చర్యలను నిలిపివేశామని రంగనాథ్ వివరించారు. అయితే, ఇతర ఎంఐఎం నేతల అక్రమ నిర్మాణాల విషయంలో కఠినంగానే వ్యవహరించామని ఆయన స్పష్టం చేశారు. "ఇప్పటికే ఎంఐఎం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కబ్జా చేసిన అనేక భారీ నిర్మాణాలను కూల్చివేశాం. సుమారు రూ.1000 కోట్ల విలువైన ఆస్తులను మజ్లిస్ నాయకుల నుంచి స్వాధీనం చేసుకున్నాం. చాంద్రాయణగుట్టలో ఓ ఎంఐఎం కార్పొరేటర్ స్థలాన్ని కూడా రికవరీ చేశాం" అని ఆయన గుర్తుచేశారు. కేవలం సామాజిక కారణాలతోనే ఫాతిమా కాలేజీపై చర్యలు తీసుకోవడానికి వెనకడుగు వేస్తున్నామని, దీన్ని బలహీనతగా చూడవద్దని ఏవీ రంగనాథ్ పరోక్షంగా ప్రస్తావించారు.

ఫాతిమా కళాశాల విషయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావు, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తదితరులు గత కొంత కాలంగా హైడ్రా తీరును తప్పుపట్టారు. అంతేకాకుండా పేదల ఇళ్లను క్షణాలలో కీల్చి వేస్తున్న హైడ్రా ఎంఐఎం నేతకు సంబందించిన కళాశాల విషయంలో ఎందుకు అలసత్వం అని నిలదీస్తున్నారు. ఈ విషయంలో హైడ్రా తీరును తప్పుపడుతూ కోర్టుకు కూడా వెళ్తామని హెచ్చరించారు. ఈ విషయంలో హైడ్రా నిర్లక్ష్యం వహిస్తే ఉద్యమం తప్పదని స్పష్టం చేస్తున్నారు.

EDITORIAL సంపాదకీయం

# ప్రజా పాలనలో రవాణా శాఖ ప్రగతి బాట






**- నాగరాజు,**
**పీఆర్వో టూ రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని ప్రజాపాలన ప్రభుత్వం అటు అభివృద్ధి ఇటు సంక్షేమం రెండూ జోడెద్దుల లాగా పనిచేస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజల అభివృద్ధి ,మహిళా సాధికారత , విద్య ,వైద్యం,వ్యవసాయం, ఇలా ఎన్నో అంశాల్లో తనదైన శైలిలో ముందుకు వెళుతుంది. ముఖ్యంగా రవాణా శాఖలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల తో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో గతంలో ఎప్పుడు లేని విధంగా ఎన్నో సంస్కరణలు చేస్తూ ముందుకు పోతుంది.

**ఓఆర్ఆర్ పరిధిలో ఆటో రిక్షాలకు అనుమతుల సడలింపు**

హైదరాబాద్ నగరంలో విపరీతమైన జనాభా వృత్తి నగరికన్నా కారణంగా ప్రజా రవాణా పై డిమాండ్ పెరుగుతుండడం వల్ల పర్యావరణ హితమైన సురక్షితమైన రవాణా విధానాలను ప్రోత్సహించేందుకు వాయు శబ్ద కాలుష్యాలను తగ్గించేందుకు ఓఆర్ఆర్ పరిధిలో ఆటో రిక్షాలకు ఎలక్ట్రిక్ , సిఎన్ జి, ఎల్ పిజీ అనుమతులు ఇస్తూ జూన్ 6 న జీవో నెంబర్ 263 విడుదల చేస్తూ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో దాదాపు 65 వేల కుటుంబాలకు కొత్తగా ఉపాధి అవకాశాలు లభించనుంది.ఈ నిర్ణయంపై ఆటోవాలాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, మంత్రి పొన్నం ప్రభాకర్ గారికి ధన్యవాదాలు చెప్తూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. కొత్తగా 20 వేల ఎలక్ట్రిక్ ఆటో రిక్షాలకు అనుమతి ఇవ్వగా10 వేల కొత్త ఎల్ పీజీ ఆటో రిక్షాలకు,10 వేల కొత్త సీఎన్ జీ అటో రిక్షాలకు అనుమతి ఇచ్చింది.డీజిల్ ,పెట్రోల్ వాహనాలకు సంబంధించిన ఆటో లకు రేటిరోఫీట్మెంట్ చేసి వాటి ఇంజన్ ను ఎలక్ట్రిక్, సీఎన్ జీ, ఎల్ పీజీ లాగా మార్చుకోవడానికి 25 వేల వాహనాలకు అనుమతి ఇచ్చింది. దీని ద్వారా 65 వేల కుటుంబాలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడి ఆర్థిక స్థిరత్వం సాధించనున్నారు.

**సారథి మరియు వాహన్**

కేంద్ర రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ నిర్దేశకత్వంలో ఎన్ ఐసీ ద్వారా అభివృద్ధి చేసిన టువంటి డిజిటల్స్ ఏవైనా సారథి మరియు వాహన్ అప్లికేషన్లను ఇతర రాష్ట్రాల మాదిరిగా అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ డిజిటల్ సేవలను అమలు చేయడం ద్వారా దేశవ్యాప్తంగా పౌరులు పొందే రవాణా శాఖ సేవలో ఏకరూపత రావడమే కాకుండా పౌరులు తమ వాహనానికి సంబంధించిన అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ కు సంబంధించిన సమాచారాన్ని దేశంలో ఎక్కడి నుండైనా తెలుసుకునే అవకాశం మరియు రవాణా శాఖ సేవలు పొందే అవకాశం ఉంటుంది. సారథి అప్లికేషన్ ను ఈ సంవత్సరం ఏప్రిల్ 30వ తేదీ గౌరవ రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు సికింద్రాబాద్ ఆర్టీవో కార్యాలయంలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు. అదేవిధంగా వాహన్ సేవలను ఈ సంవత్సరం ఆగస్టు చివరి నాటికి అందుబాటులోకి తీసుకురావడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించబడింది.

**పాఠశాలల్లో పిల్లల ట్రాఫిక్ అవగాహన పార్కులు**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో పిల్లల కోసం ట్రాఫిక్ అవగాహన ఏర్పాటు చేయడం సురక్షిత తెలంగాణ ఏర్పాటు దిశగా చేపట్టిన కీలక కార్యక్రమాల్లో ఒకటి. విద్యార్థులు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం వారిని "రోడ్ సేఫ్టీ యోధులుగా" తీర్చిదిద్దడం ఈ పార్కుల ఉద్దేశం. పిల్లల కోసం మొట్టమొదటి ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ ను నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ఈ సంవత్సరం జనవరి 20న గౌరవ తెలంగాణ గవర్నర్ విష్ణుదేవ్ వర్మ గారు ప్రారంభించారు. మరో పార్కును మార్చ్ 23 న కరీంనగర్ రవాణా శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేయడం జరిగింది. తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ట్రాఫిక్ అవేర్నెస్ పార్కులు ఏర్పాటు చేయడం కోసం ఒక ప్రణాళిక బద్ధంగా ముందుకు రవాణా శాఖ విద్యాశాఖలు కలిసి సంయుక్తంగా ముందుకు వెళుతున్నాయి. ఇటువంటి ట్రాఫిక్ అవేర్నెస్ పార్కులను ఖాళీ స్థలాలు ఉన్న రవాణా శాఖ కార్యాలయాల్లో, అవకాశం ఉన్న పాఠశాలలో ఏర్పాటు చేయడానికి ఒక ప్రత్యేక ప్రణాళిక ద్వారా ముందుకు పోతున్నాం.

**ఎలక్ట్రిక్ వాహన పాలసీ**

రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించడానికి తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక నిర్ణయం ఈవీ పాలసీ. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించడానికి, తెలంగాణ రాష్ట్రంలో కొనుగోలు చేసి నమోదు కాబోయే వివిధ కేటగిరీల ఎలక్ట్రిక్ వాహనాలకు 100% రోడ్ టాక్స్ మరియు రిజిస్ట్రేషన్ ఫీజులు మినహాయిస్తూ తెలంగాణ ప్రభుత్వం జీవో నెంబర్ 41 గత సంవత్సరం నవంబర్ 16న జారీ చేసింది. ఈ వాహన పాలసీ 2026 డిసెంబర్ 31 వరకు అమల్లో ఉండనుంది. ఈ ఎలక్ట్రిక్ వాహనాల పాలసీ కింద జులై 1 నాటికి 42,348 వాహనాలకు రూ.311.07 కోట్లు మినహాయించడం జరిగింది.

## టిఎస్ నుండి టీజీ గా నామకరణంలో మార్పు

2024 మార్చ్ 15 న రవాణా శాఖ తెలంగాణ వాహనాలకు, వాహనాల రిజిస్ట్రేషన్ కోడ్ ను టీఎస్ నుండి టీజీ' గా మార్చింది. ఈ మార్పు తెలంగాణలో రిజిస్టర్ అయిన వాహనాలకు ఒక ప్రత్యేక గుర్తింపును తీసుకురావడం కోసం చేయడం జరిగింది. ఇది ఒక్క ప్రత్యేకమైన ప్రాంతీయ గుర్తింపును స్థాపించడానికి రాష్ట్రం చేస్తున్న ప్రయత్నాలను ప్రతిబింబిస్తుంది. ఈ కొత్త నియమాలని అమలు చేయడం ద్వారా తెలంగాణ యొక్క గుర్తింపును మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుంది అదే సమయంలో రాష్ట్ర ప్రజలలో తెలంగాణ సొంత భావనను పెంచుతుంది ఈ విధానం అమల్లోకి వచ్చినప్పటి నుండి నేటి వరకు టీజీ కోడ్ కింద 13.05 లక్షల వాహనాలు రిజిస్ట్రేషన్ అయ్యాయి

**వెహికిల్ స్క్రాపింగ్ పాలసీ**

తెలంగాణ ప్రభుత్వం గత సంవత్సరం సెప్టెంబర్ 30వ తేదీ వెహికల్స్ స్క్రాపేజ్ పాలసీ ప్రకటించింది. పాలసీ కింద ప్రభుత్వానికి సంబంధించినటువంటి 15 సంవత్సరాలు నిండిన అన్ని వాహనాలను తప్పనిసరిగా తుక్కుగా మార్చాల్సిందిగా అదేవిధంగా గడువు తీరిన ప్రైవేటు వాహనాలు తుక్కుగా మార్చడానికి ప్రోత్సహించే విధంగా వివిధ బకాయిలు మాఫీ చేయడమే కాకుండా కొత్త వాహనాలను కొన్నప్పుడు పన్ను రాయితీ కల్పించే విధంగా ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో మూడు RVSF కేంద్రాలు ఉన్నాయి.

**ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్లు (ఏటీఎస్)**

తెలంగాణ ప్రభుత్వం వాహనాల ఫిట్నెస్ను అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సమర్థవంతంగా నిర్వహించడానికి తద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి మరియు రోడ్డు భద్రతను మెరుగుపరచడానికి 37 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్స్ నెలకొల్పాలని నిర్ణయించింది. ఈ ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్స్ ద్వారా రోడ్డుపై ఉపయోగించడానికి సురక్షితం కాని వాహనాలను తొలగించడమే కాకుండా వాహన ఉద్గారా నిబంధనలు పాటించని వాహనాలను గుర్తించి వాటి మరమ్మత్తులు లేదా రిజిస్ట్రేషన్ రద్దును సూచించడం జరుగుతుంది.

**రవాణా శాఖ డిపార్ట్మెంట్ కు కొత్త లోగో రూపకల్పన**

తెలంగాణ రవాణా శాఖకు ప్రత్యేక గుర్తింపు చిహ్నంగా గౌరవ రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి గారి ఒక విలక్షణమైన లోగోను రూపొందించడం జరిగింది. ఈ లోగోను గత సంవత్సరం డిసెంబర్ 5న గౌరవ ముఖ్యమంత్రి గారు ఆవిష్కరించారు. ఈ రవాణా శాఖ లోగో డిపార్ట్మెంట్ కు గర్వకారణంగా మరియు గుర్తింపుగా పనిచేస్తుంది.

**వివిధ ఐటి డిజిటల్ & సాంకేతిక చొరవలు**

**మీసేవ యాప్ (టి - యాప్ పోలియో)**

ఆర్టిఏ కార్యాలయాలకు వెళ్లకుండా మీసేవ యాప్ (టీ యాప్ ఫోలియో) ద్వారా 18 ఆర్టీఏ సేవలను ఇంటి దగ్గర నుండే మొబైల్ ఫోన్ ద్వారా పొందవచ్చు. దరఖాస్తుదారుల గుర్తింపు మరియు వాస్తవికతను ధృవీకరించడానికి ఈ మొబైల్ యాప్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ను ఉపయోగిస్తుంది. వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు మరియు డ్రైవింగ్ లైసెన్సులను వాహనదారులకు భద్రంగా మరియు సమర్థవంతంగా అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కార్డుల ముద్రణ మరియు డిస్పాచ్ ప్రక్రియను కేంద్రీకృతం చేయాలని నిర్ణయించింది. ఈ కేంద్రీకృత ప్రింటింగ్ మరియు డిస్పాచ్ విధానంలో ఈ క్రింద సూచించిన విధానాల ద్వారా సమర్థవంతంగా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు మరియు డ్రైవింగ్ లైసెన్స్ కార్డులు వాహనదాలకు అందజేయబడతాయి.

**రవాణా శాఖ నోటిఫై చేసిన ఉద్యోగాలు**

రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ నిబద్ధతకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కల్పనకు రవాణా శాఖలో పలు కీలక పోస్టులను నోటిఫై చేయడం జరిగింది. ఆర్టీవో 4 ఇంకా టీజీపీఎస్సీ ద్వారా ఫలితాలు విడుదల కావాల్సి ఉంది. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్స్ (ఏఎంవీఐ) 113 పోస్టులకు....103 పోస్టులు భర్తీ చేయడం జరిగింది. 54 రవాణా శాఖ కానిస్టేబుల్ భర్తీ చేయడం జరిగింది. 20 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయడం జరిగింది. నిరుద్యోగ యువతకు మరిన్ని అవకాశాలు కల్పించడానికి పదోన్నతుల ప్రక్రియ వేగవంతం చేయడం జరిగింది.

**ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్ (ఏడీటీటీ)**

డ్రైవింగ్ నైపుణ్యాలను పరీక్షించడానికి నిర్దేశించినటువంటి 25 ద్విచక్ర వాహనాల ట్రాక్ లు ,27 ఫోర్ వీలర్ వాహనాల ట్రాక్ లు , 5 హెవీ వాహనాల ట్రాక్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్ ల అధునాతన సాంకేతిక పరిజ్ఞానం జోడించి డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాకులుగా మార్చడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

**వాహన లొకేషన్ ట్రాకింగ్ డివైస్ లు**

కేంద్ర నిర్భయ పథకంలో భాగంగా ప్రజారవన వాహనాల్లో వాహనా లోకేషన్ ట్రాకింగ్ డివైస్లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజా రవాణాలో మహిళల మరియు పిల్లల భద్రతను పెంపొందించాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిమాదికన ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని కృత నిశ్చయం తో ఉంది. ఈ పథకంలో భాగంగా రవాణా శాఖ నేతృత్వంలో ఒక మానిటరింగ్ సెంటర్ ని ఏర్పాటు చేసి ప్రజా రవాణా వాహనాలను వాటిలో బిగించినటువంటి లొకేషన్ ట్రాకింగ్ డివైస్లు మరియు పానిక్ బటన్ల ద్వారా పర్యవేక్షించడం జరుగుతుంది.

**సురక్షితమైన కేంద్రీకృత ప్రదేశంలో విక్రేత ఆధారిత ముద్రణ**

- సర్వీసు పొందిన మూడు రోజుల్లో పోస్టల్ డిపార్ట్మెంట్ ద్వారా డెలివరీ
- కార్డుల ముద్దుల మరియు డిస్పాస్థితి తెలుసుకోవడానికి సాఫ్ట్వేర్ ఆధారిత ట్రాకింగ్
- యదార్ధతను తెలుసుకోవడానికి క్యూఆర్ కోడ్ తో కూడిన కార్డులు

**పొల్యూషన్ టెస్టింగ్ నెట్వర్కింగ్**

వాహన ఉద్గారాలను పర్యవేక్షించడానికి అన్ని వాహన కాలుష్య టెస్టింగ్ సెంటర్లను క్రిందిర్కుత ఐటీ ఆదారిత వ్యవస్థ అనుసంధానించడం ద్వారా వాటి పనితీరును మెరుగుపరచడం జరుగుతుంది. రవాణా శాఖలో కేసులను గుర్తించడానికి, ఈ చలాన్ లను రూపొందించడానికి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జాతీయ రాష్ట్ర రహదారులపై వ్యూహాత్మక ప్రదేశాల వద్ద 60 ఏఎన్పీఆర్ కెమెరాలను ఏర్పాటు చేయడం ఇందులో ఒక అంశం. అదేవిధంగా వాహన తనిఖీ అధికారులకు చేతిలో ఇమిడిపోయే క్యాబ్లను అందించడం ద్వారా వారి పనితీరును మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకోబడుతున్నాయి.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp- 74369 39999

# భారత్‌పై చైనా వాటర్ బాంబు

**మహా:** అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దులోని బ్రహ్మపుత్ర నదిపై చైనా ప్రపంచంలోనే అతిపెద్ద హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మిస్తుండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఇది భారత్‌పై చైనా 'వాటర్ బాంబ్' గా ప్రజతు, మేధావులు పేర్కొంటున్నారు. చైనా మిలటరీ కంటే కూడా ఈ ప్రాజెక్టు నిర్మాణం ప్రమాదకరమని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పెమా ఖండూ వార్నింగ్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుతో దిగువ ప్రాంతాల్లో నివసించే ప్రజల ప్రాణాలకు.. ముఖ్యంగా అరుణాచల్ ప్రదేశ్, అసోంకు ముప్పు ఉంటుందని 'పీటీఐ'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు. అంతర్జాతీయ నీటి పంపకాల ఒప్పందానికి చైనా నిరాకరిస్తుండటంతో ఈ ప్రాజెక్టు మరింత ఆందోళన కలిగిస్తోందని పెమా ఖండూ అన్నారు. 'సమస్య ఏమిటంటే చైనాను విశ్వసించలేం. వారు ఏమి చేస్తారో ఎవరికీ తెలియదు. ప్రాజెక్టు వల్ల మా గిరిజనులు, వారి అస్థిత్వానికి కూడా ముప్పు ఉంటుంది. ఈ ప్రాజెక్టును వాటర్ బాంబ్‌గా కూడా ఉపయోగించవచ్చు' అని తెలిపారు. చైనా కనుక అంతర్జాతీయ జలాల పంపిణీ ఒప్పదంపై సంతకాలు చేస్తే డ్యామ్ వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందని అన్నారు. అరుణాచల్, అసోంలో రుతుపవనాలతో వచ్చే వరదలను నిరోధించవచ్చని, అలాంటి ఒప్పదాలు లేకపోతే తలెత్తే ముప్పు కూడా తీవ్రంగా ఉండవచ్చని హెచ్చరించారు. డ్యామ్ పూర్తయి అకస్మాత్తుగా జలాలను విడుదల చేస్తే తమ సియాంగ్ బెల్ట్ మొత్తం నాశానమవుతుందని, ఆదివాసీలు పూర్తిగా భూములు, ఆస్తులు, చివరకు ప్రాణాలు కూడా కోల్పోతారని అన్నారు. ఈ ప్రమాదాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో అరుణాచల్ ప్రదేశ్ ప్రభుత్వం సియాంగ్ అప్పర్ మల్టీపర్పస్ ప్రాజెక్టు కోసం కృషి చేస్తోందన్నారు. ఇది మనను మనం పరిరక్షించుకునేందుకు, మన నీటి అవసరాలను తీర్చుకునేందుకు ఉపయుక్తమవుతుందన్నారు.

**భారత్ కు అప్ డేట్ లేదు**

చైనా ఇప్పటికే వారిపైపు ఉన్న బ్రహ్మపుత్ర నదిపై ప్రాజెక్టు ప్రారంభించడం కానీ ప్రారంభానికి సిద్ధంగా ఉండటం కానీ చేస్తోందని ఆయన పునరుద్ఘాటించారు. అయితే భారత్‌తో ఎలాంటి అప్‌డేటెడ్ సమాచారం పంచుకోవడంలేదని చెప్పారు. డ్యామ్ పూర్తయితే లాంగ్ రన్‌లో మన సియాంగ్, బ్రహ్మపుత్ర నదులు గణనీయంగా ఎండిపోయే అవకాశాలున్నాయని అన్నారు. చైనా ఒకవేళ ఆకస్మికంగా వరద జలాలను వదిలిపెడితే దానిని అదుపు చేసేందుకు మనం సొంత మౌలిక సదుపాయాలతో సిద్ధంగా ఉండాలని అన్నారు.



# సిటీ శివారు చెరువులపై హైడ్రా ఫోకస్

## ఎల్బీ నగర్ బైరామల్ గూడ,తుర్కయంజాల్ మాసబ్ చెరువులను పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్



**ఎల్బీనగర్,మహా:** ఎల్బీనగర్ నియోజకవర్గంలోని చెరువు లపై హైడ్రా ఫోకస్ చేస్తున్నది. అనేక చెరువులు, కుంటలు కబ్జాలకు గురయ్యాయని, ఉన్న నీటి వనరుల ను కాపాడాలని ప్రజలు, ప్రజాప్రతినిధులు అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఎల్బీనగర్ నియోజకవర్గంలోని చెరువుల కబ్జాలపై దృష్టి సారించారు. ఎల్బీనగర్ లోని బైరామల్ గూడ చెరువు కబ్జాకు సంబంధించి రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి ఇటీవల హైడ్రా కమిషనర్ రంగనాథ్ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన హైడ్రా కమిషనర్ తన అధికార బృందంతో కలిసి బుధవారం బైరామల్ గూడ చెరువును పరిశీలించి, కబ్జా అయిన స్థలాన్ని పరిశీలించారు. వీలైనంత త్వరలో ఆక్రమణలను తొలగిస్తామని తెలిపారు. అన్ని శాఖల సమన్వయం తో కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. మరొకసారి ఎల్బీనగర్ లో పర్యటించి అన్ని చెరువులను పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటా మని రంగనాథ్ తెలిపారు. రోడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మాల్ రెడ్డి రామ్ రెడ్డి మాట్లాడుతూ... బైరామల్ గూడ చెరువు కబ్జాపై గతంలో రేవంత్ రెడ్డి మల్కాజ్ గిరి ఎంపీగా, టీపీసీసీ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు తీవ్రంగా స్పందించారని గుర్తు చేశారు. బైరామల్ గూడ చెరువును ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, తన అనుచరులు కబ్జా చేయడంతోనే హస్తినాపురం డివిజన్ లోని రెడ్డి కాలనీతో పాటు 150 కాలనీల నుంచి వచ్చే వరద నీరు వివిధ కాలనీల్లోని ఇండ్లకు చేరుతుందని తెలిపారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అండదండలతో చాపల చెరువు, బైరామల్ గూడ చెరువులతోపాటు ఎల్బీనగర్ లోని ఇంకా కొన్ని చెరువులు కబ్జా చేసి, ప్లాట్లు చేసి అమ్ముకున్నారని మల్‌రెడ్డి రాంరెడ్డి ఆరోపించారు. ఎల్బీనగర్ లోని చెరువులను పరిరక్షించడానికి అధికార యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టి, పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. కమిషనర్ వెంట హైడ్రా అధికారులు, సిబ్బంది ఉన్నారు.

**మాసాబ్‌చెరువును పరిశీలించిన హైడ్రా కమిషనర్**

చెరువులు పూడ్చడాన్ని, ఆక్రమణలను అడ్డుకుంటేనే భవిష్యత్తులో వరద ముంపును అరికట్టగలమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అభ్యర్థన మేరకు తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మాసాబ్‌చెరువు, దిలావర్‌ఖాన్ చెరువు పరిసర ప్రాంతాలను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలాల కబ్జా వల్లే ముంపు సమస్య తలెత్తుతోందన్నారు. ఇంజాపూర్‌లో గత ప్రభుత్వం నాలాను పూడ్చి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టారని, ఇప్పుడు ఆ భవనం సెల్లార్లన్నీ నీటిలోనే ఉన్నాయన్నారు. మాసాబ్‌చెరువు నాలాపై ఆక్రమణలను తొలగిస్తామని, ఇళ్లు నిర్మించుకున్నవారికి నష్ట పరిహారం అందజేస్తామని రంగనాథ్ వెల్లడించారు. మాసాబ్‌చెరువు పైనుంచి కింద మూసీ వరకు 7.4కి.మీ. నాలా ఉన్నట్లు గుర్తించినట్లు రంగనాథ్ తెలిపారు. తుర్కయంజాల్, ఇంజాపూర్, తొర్రూరు ప్రాంతాల్లో నాలాల ఆక్రమణలను అడ్డుకుంటేనే భవిష్యత్తులో ముంపునకు గురికాకుండా, వరదలను నివారించగలమని రంగనాథ్ తెలిపారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రోడ్ల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ రాంరెడ్డి, నాయకులు యాదిరెడ్డి, గుండ్లపల్లి ధన్‌రాజ్‌గౌడ్, వంశీధర్‌రెడ్డి, బీజేపీ నేత బచ్చిగళ్ల రమేష్, అధికారులు పాల్గొన్నారు.

## అమెజాన్, బోట్ కంపెనీలపై కేసు వేసి గెలిచిన అసామాన్యుడు

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్‌లోని డిస్ట్రిక్ట్ కన్సూమర్ కోర్టు బుధవారం ఓ సామాన్యుడి వైపు తీర్పునిచ్చింది. దిగ్గజ కంపెనీలైన అమెజాన్, బోట్ (ఇమాజిన్ మార్కెటింగ్ ప్రైవెట్ లిమిటెడ్) కంపెనీలపై జి.శ్రీనివాస్ అనే యువకుడు సర్వీస్ దక్కక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని.. చివరకు హైదరాబాద్‌లోని డిస్ట్రిక్ట్ కన్సూమర్ కోర్టును ఆశ్రయించాడు. గత ఏడాది జూన్ నెలలో బోట్ కంపెనీ ప్రొడక్ట్ 5500 డీఏ సౌండ్‌బార్‌ను అమెజాన్‌లో రూ.20వేలకు కొన్నాడు. అయితే అది సరిగా పనిచెయ్యకపోవడంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. రెండు కంపెనీల యొక్క కస్టమర్ కేర్ వాళ్లను ఆశ్రయించినప్పటికీ సరైన సర్వీస్ అందివ్వకపోగా.. ఏమి చేసుకుంటారో చేసుకోండి అన్నట్టుగా వ్యవహరించారు. సదరు కన్సూమర్ నాలుగు నెలల పాటు ప్రొడక్ట్ సర్వీస్ కోసం కంపెనీ యొక్క కస్టమర్ కేర్ వాళ్లతో మాట్లాడినా ప్రయోజనం లేకపోయింది. మెయిల్ ద్వారా, ఫోన్ ద్వారా ఎన్నో విధాలుగా ప్రయత్నం చేసినప్పటికీ కంపెనీ వారు సమస్యను పరిష్కరించలేదు. దీంతో విసుగు చెందిన శ్రీనివాస్ కన్సూమర్ కోర్టును ఆశ్రయించారు. సంవత్సర కాలం సదరు కంపెనీలతో కోర్టులో పోరాడి చివరకు కేసును గెలిచాడు.

## బల్దియా కమిషనర్ కు వినతి పత్రం అందజేసిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు

### ప్రతిపక్ష కార్పొరేటర్ల కు మాట్లాడే స్వేచ్ఛ ఇవ్వాలి

### వివక్ష లేకుండా నిధులు కేటాయించాలి



**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీ డిప్యూటీ మేయర్ రిజ్వాన షమీం మసూద్ తో పాటు కార్పొరేటర్లు కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డిప్యూటీ మేయర్ రిజ్వాన షమీం తో కలిసి బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ప్రతిపక్ష కార్పొరేటర్లు అయినందుకే మమ్మల్ని తమ డివిజన్ల లో నెలకొన్న సమస్యలతో పాటు కౌన్సిల్ హాల్ పునరుద్ధరణ కు అయిన ఖర్చు గురించి సభలో మాట్లాడ నివ్వకుండా మైక్ ను కట్ చేసి ఎజెండా అంశాలను మాత్రం చదవడం , అలాగే బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ పునరుద్ధరణ లో భాగంగా అయిన ఖర్చులో ఎలక్ట్రికల్ కు సంబంధించి 75 లక్షలు తో పాటు బిల్డింగ్ మరమ్మత్తులకు గాను 75 లక్షలు ఖర్చు అవడం శోచనీయమని ఇంత ఖర్చు తో కొత్త భవనమే నిర్మించ వచ్చునని, వీటితోపాటు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో పట్టణాలలో అయితే కార్పొరేటర్ల ను హాయ్ ఆయా డివిజన్ కు చైర్మన్లు గా ప్రభుత్వం నియమించిందని ఇందుకు భిన్నంగా స్థానిక బిఆర్ఎస్ కార్పొరేటర్లకు ఎటువంటి అధికారిక సమాచారం లేకుండానే ప్రోటోకాల్ ను మరిచి అధికార పార్టీ నాయకులే అధికారులతో కలిసి లబ్ధిదారులకు మంజూరు పత్రాల ను అందజేస్తున్నారని విచారం వ్యక్తం చేస్తూ ఇందుకు తమకు కేటాయించిన చైర్మన్ పదవుల నుంచి తమను తప్పించాలని లేదా ప్రోటోకాల్ పాటించాలని ముఖ్యంగా ఆయా డివిజన్లలో ప్రతిపక్ష పార్టీ ప్రజా ప్రతినిధులు ఉన్నా డివిజన్ లలో నిధుల కేటాయింపుల్లో వివక్షత లేకుండా నిధులు కేటాయించాలని కోరుతూ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు.



## సీఇఐఆర్ పోర్టల్ ను సద్వినియోగం చేసుకోండి

### పోగొట్టుకున్న మొబైల్స్ ను బాధితులకు అప్పగించిన ఇన్స్పెక్టర్

**వరంగల్ మహా;** వరంగల్ నగరంలోని ఇంతేజార్గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో సెల్ ఫోన్లను పోగొట్టుకున్న ఐదుగురు వ్యక్తుల యొక్క ఖరీదైన సెల్ ఫోన్లను ఇన్స్పెక్టర్ యంఏ షుకూర్ బుధవారం వారికి అప్పగించారు. ఈ ప్రక్రియను సీఇఐఆర్ పోర్టల్ ను ఉపయోగించి ట్రాక్ చేసి వాటిని తిరిగి సెల్ ఫోన్లు పోగొట్టుకున్న వ్యక్తులకు అప్పగించడం జరిగిందని ఇంతెజార్గంజ్ గంజ్ ఇన్స్పెక్టర్ యంఏ షుకూర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సైలు వెంకటేశ్వర్లు, రోహిత్ లు తో పాటు ఆన్లైన్ రైటర్ సందీప్, క్రైమ్ కానిస్టేబుల్ దీపక్ ఈ సెల్ ఫోన్ల లను పోర్టల్ ద్వారా శోధించిన వీరిని ఇన్స్పెక్టర్ షుకూర్ అభినందించారు.

## మార్కెట్ లోనే వ్యాపారాలు చేసుకొనేలా చర్యలు చేపట్టాలి

### బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్



**హన్మకొండ మహా;** కాజీపేట మార్కెట్ లోనే చిరు వ్యాపారులు తమ వ్యాపారాలు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ నగర పరిధి లోని కాజీపేట మార్కెట్ బాల సముద్రం ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి లో సందర్శించి సమర్థవంతం గా నిర్వహించుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ రోడ్ల మీద వ్యాపారాలు నిర్వహించడం వల్ల వినియోగదారులు మార్కెట్ లోకి రావడంలేదని కాజీపేట మార్కెట్ కు సంబంధించి స్థానిక మార్కెట్ దారులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో రోడ్డు మీద కూరగాయలు అమ్మే వారిని మార్కెట్ లో వ్యాపారాలు నిర్వహించు కునేలా చూడాలని ఇంటిగ్రేటెడ్ నాన్ వెజ్ మార్కెట్ లు ఓపెన్ చేసి మటన్ చికెన్ విక్రయించే దుకాణాలను అక్కడే వ్యాపారాలు నిర్వహించేలా చూస్తూ మార్కెట్ ను వినియోగంలోకి తీసుకురావాలని, కూరగాయల మార్కెట్ యందు పోలీసు, పట్టణ ప్రణాళిక విభాగం ఇంజనీరింగ్ విభాగాల సమన్వయంతో స్ట్రీమ్ లైన్ చేసి వీధి వ్యాపారులకు ఉపాధి అందేలా చూడాలని, స్లాటర్ హౌస్ చిన్నగా ఉందని ఇందుకు కావలసిన కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని అవకాశం ఉంటే నూతన వదశాల ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. బాలసముద్రంలోని కోకోపిట్ యూనిట్ ను పరిశీలించిన కమిషనర్ నిర్వహణ బాగుందని కొబ్బరి బొండాల వ్యర్థాలు ఎక్కువగా పేరుకు పోయి ఉన్నాయని వేగవంతంగా ప్రాసెసింగ్ చేసి నిల్వ లేకుండా చూడాలని ఈ యూనిట్ కార్పొరేషన్ కు మోడల్ గా నిలుస్తుందని 50 కిలో గ్రాముల బల్క్ వేస్ట్ జనరేటర్ ను కమిషనర్ పరిశీలించారు . వర్మీ కంపోస్ట్ యూనిట్ చాలా బాగుందని దీనిని మరింత బలోపేతం చేయడానికి మరో షెడ్ ను ఏర్పాటు చేసి సామర్థ్యాన్ని పెంచాలని ఈ ఈ నీ ఆదేశించారు. బయో మిథనైజేషన్ ప్లాంటుకు మరమత్తులు చేపట్టి పునరుద్ధరించాలని అలా కాని పక్షంలో ఇదే ప్రాంతం లో నూతన బయో మిథనైజేషన్ ప్లాంటు ఏర్పాటు కు చర్యలు చేపట్టాలని విండ్రో కాంపోస్టు యూనిట్ ఉన్న ప్రాంతంలో నీరు చేరుతుందని దానిని అరికట్టడానికి అక్కడ మొరం వేసి అరికట్టి బలోపేతం చేయాలని కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సి.ఎం.హెచ్.ఓ డా. రాజారెడ్డి, వెటర్నరీ వైద్యులు డాక్టర్ గోపాలరావు, ఈ ఈ రవి కుమార్, డి ఈ సారంగం, ఏ ఈ లు రాగి శ్రీకాంత్, మేనక, సానిటరీ ఇన్స్పెక్టర్ అనిల్ వావ్, ప్రతినిధి పవన్, తదితరులు, పాల్గొన్నారు.

### మర్డర్ కేసులో ఇద్దరు నిందితులకు

## 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష జరిమాన

**వరంగల్ మహా;** 2022 సంవత్సరంలో వరంగల్ నగరంలోని మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఉర్సుగుట్ట సమీపంలో మహాలక్ష్మి బేకరీ వద్ద అర్ధరాత్రి సమయంలో నిందితులు మూత్ర విసర్జన చేస్తుండగా వారించినందుకు వనం రాకేష్ అనే వ్యక్తిని హతమార్చి, మరుపట్ల నిఖిల్ అనే వ్యక్తిపై హత్యాయత్న ప్రయత్నం చేసిన శివనగర్ కు చెందిన గాదుదల రాజేష్ , జున్ను హరి కృష్ణ@బంటి అనే నిందితులకు బుధవారం గౌరవ వరంగల్ జిల్లా కోర్ట్ జడ్జి నిర్మల గీతాంబ సంచలనమైన తీర్పును వెలువరించింది. ఈ కేసులో నిందితులిద్దరికీ 10 సంవత్సరాల కఠిన కారగార శిక్ష తో పాటు ఒక్కొక్కరికి 15వేల రూపాయల చొప్పున జరిమాన విధించారు. ఈ కేసును అప్పటి ఇన్స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ కేసు నమోదు చేసి, దర్యాప్తు జరిపి నిందితులపై ఛార్జ్ షీట్ కోర్టులో ఫైల్ చేయగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ కేసును వాదించగా ప్రస్తుత ఇన్స్పెక్టర్ బొల్లం రమేష్ సమక్షంలో కోర్టు లైజన్ ఆఫీసర్ కంతేటి హరికృష్ణ కోర్ట్ కానిస్టేబుల్ దౌడు ప్రతాప్ ప్రాసెస్ సర్వర్ డి సదానందం సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా నిందితులు ఇద్దరికీ శిక్ష పడటంలో ప్రతిభ కనబరిచిన వారిని ఉన్నతాధికారులు అభినందించినారు.

## అనధికారిక లే ఔట్‌లను తొలగించాలి

### నగర మేయర్ గుండు సుధారాణి

- మునిసిపల్ స్థలాలను రక్షించాలి
- టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశం



**వరంగల్ మహా;** బల్దియా పరిధిలో అనధికారిక లే ఔట్ లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని వాటిని గుర్తించి తొలగించుటకు తగిన చర్యలు తీసుకోవాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని మేయర్ చాంబర్ లో టౌన్ ప్లానింగ్ అధికారులతో జరిగిన సమావేశంలో మేయర్ సమర్థవంతంగా నిర్వహించుటకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో అనధికారిక లే ఔట్ లు ప్లాట్ లను కొనుగోలు చేయకూడదని, వీటి పట్ల ప్రజల్లో చైతన్యం కలిగించడానికి టౌన్ ప్లానింగ్ విభాగం వివిధ సామాజిక మాధ్యమాలు కరపత్రాలు ఫ్లెక్సీ ల ద్వారా అవగాహన కలిగించాలని మేయర్ అధికారులకు సూచించారు. మున్సిపాలిటీ కి చెందిన ఓపెన్ ప్లాట్లు కాంపౌండ్ వాల్ లేని మున్సిపల్ స్థలాలు పార్కు లు బల్దియా కు చెందిన ప్రాపర్టీలని సూచించే విధంగా బోర్డు లు ఏర్పాటు చేయాలని, గ్రీన్ ఏరియా కు సంబంధించిన ప్రాపర్టీని ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షించాలని, బల్దియా వ్యాప్తంగా క్షేత్ర స్థాయి లో టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది అనధికార లేఅవుట్ లు, ముందస్తుగా గుర్తించాలని, వర్షాకాలం నేపథ్యం లో నగర వ్యాప్తంగా ఉన్న శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి వారికి నోటీసులు అందించి ప్రాణ, ధన నష్టం కలుగ కుండా ఖాళీ చేయించాలని, అపార్ట్మెంట్ లలో గల సెల్లార్ ప్రాంతాల్లో విద్యుత్ ఉపకరణాలు లేకుండా చూడాలని ఈ సందర్భం గా మేయర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ రవీందర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు శ్రీనివాస్ రెడ్డి, రజిత, యెర్షాద్, ప్రశాంత్, తోపాటు టిపిఎస్ లు, టి పి బి ఓ లు, తదితరులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెకు టీడబ్ల్యూజేఎఫ్ సంఘీభావం




**వరంగల్ మహా;** సార్వత్రిక సమ్మెకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపారు. బుధవారం వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమైన వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన మహా ర్యాలీ లో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మచ్చిక వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా అధ్యక్షులు పొడేటి అశోక్, ఉపాధ్యక్షులు ఈర్ల సురేందర్, కోశాధికారి గాయపు రాజు రెడ్డి, చిలువేరు శ్రీకాంత్, గుర్రాల శ్రీనివాస్, సదిరం కుమార్, ఎండీ.అక్మల్ పాషా, మోడం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంక్షేమానికి సమగ్ర చట్టం చేయాలి



### ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆశలత

**ఆదిలాబాద్, మహా:** ప్రభుత్వాలు మహిళల సంక్షేమానికి సమగ్ర చట్టం చేయాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆశలత డిమాండ్ చేశారు. బుధవారం ఆదిలాబాద్ కు వచ్చిన ఆమె ఐద్వా నాయకులతో కలిసి సార్వత్రిక సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని ధ్వజమెత్తారు. అన్ని రంగాల్లో పనిచేస్తున్న మహిళలకు భద్రత కల్పించాలని, మగవారితో సమానంగా సమాన పనికి సమాన వేతనం అందించాలని తెలిపారు. ఉపాధి కూలి రేట్లు పెంచి రైతులకు గిట్టుబాకు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు మంజుల, జిల్లా కార్యదర్శి లంక జమున, అధ్యక్షురాలు కోవే శకుంతల, లలిత, పొచ్చక్క, విద్య, మీనాక్షి, ఇర్ఫాన, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

## చౌలపల్లిలో గొర్రెల మందపై కుక్కల దాడి.. రూ.2 లక్షల నష్టం

### బాధిత రైతు ఎలిగపల్లి కృష్ణయ్యను పరామర్శించిన అందే బాబయ్య..



**షాద్‌నగర్, మహా:** కేశంపేట మండలంలోని చౌలపల్లి గ్రామ శివారులో మంగళవారం అర్ధరాత్రి ఘటన చోటుచేసుకుంది. రైతు ఎలిగపల్లి కృష్ణయ్య వ్యవసాయ పొలంలో ఉన్న గొర్రెల మందపై మోసుకువచ్చిన కుక్కల గుంపు అకస్మాత్తుగా దాడి చేయడంతో మొత్తం 21 గొర్రెలు మృతి చెందాయి. ఈ ఘటనలో రైతుకు సుమారుగా రూ.2 లక్షల మేర ఆర్థిక నష్టం వాటిల్లింది.ఈ ఘటనపై సమాచారం తెలుసుకున్న బీజేపీ షాద్‌నగర్ ఇంచార్జ్ అందే బాబయ్య వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత రైతు కృష్ణయ్యను పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ యువ నాయకులు పసుపుల ప్రశాంత్, రోళ్ళ రఘు రాములు గౌడ్, పద్మ కృష్ణయ్య, కేశంపేట మండల అధ్యక్షురాలు రోళ్ళ రాధిక గౌడ్, నాయకులు పాండురంగారెడ్డి రెడ్డి, కంచుకోట నర్సింలు ఎస్. నర్సింహులు, రమేష్, ఆవుల శ్రీశైలం, వెంకటేష్, గడిగే లక్ష్మయ్య, ఎస్. సాయి రామ్, పీ. సాయి రామ్ తదితరులు ఉన్నారు.ఈ సందర్భంగా బీజేపీ షాద్ నగర్ ఇంచార్జ్ అందే బాబయ్య ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరుతూ ఇలాంటి ఘటనల వల్ల రైతులు తీవ్ర నష్టాల్లోకి వెళ్లిపోతున్నారు. ప్రభుత్వం తక్షణమే సహాయాన్ని ప్రకటించి బాధిత రైతుకు న్యాయం చేయాలి" అని డిమాండ్ చేశారు. పశువైద్య శాఖ తక్షణమే స్పందించి గ్రామంలో చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. స్థానికంగా ఉన్న కోళ్లఫారాలే ఈ పెంచి పోషిస్తున్నాయని కోళ్లు చనిపోతే బహిరంగ ప్రదేశాల్లో పడేయటం వలన వాటిని తిని జంతువుల పై దాడి చేస్తున్నాయని మనుషులు మీద దాడి మనం పేపర్లలో రోజు చూస్తూనే ఉన్నామని దయచేసి వాటిపై చర్యలు తీసుకోవాలని రైతులను ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు.

## ఘనంగా ఏబీవీపీ 77వ ఆవిర్భావ దినోత్సవం

### అమ్రాబాద్ జూనియర్ కళాశాలలో జెండా ఆవిష్కరణ

### ఏబీవీపీ బాగ్ ప్రముఖ నోముల అక్షిత్ గౌడ్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 77వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండల కేంద్రంలోని జూనియర్ కాలేజీ మైదానంలో ఏబీవీపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి అమ్రాబాద్ ఏబీవీపీ బాగ్ ప్రముఖ నోముల అక్షిత్ గౌడ్ హాజరై మాట్లాడుతూ... దేశభక్తికి జాతీయ శక్తికి మారుపేరు జ్ఞానం శీలం ఏకత సిద్ధాంతంతో వివేకానందుని ఆశయాలతో విద్యకు అండగా విద్యార్థికి అండదండగా దేశ పునర్నిర్మాణమే తమ ఎజెండాగా నేటి విద్యార్థి రేపటి పౌరుడై వ్యక్తి నిర్మాణం ద్వారా జాతీయ పునర్నిర్మాణం అనే మహా యజ్ఞ కార్యాన్ని నిర్మిస్తున్న జాతీయ వాద బావలతో సమాజానికి పరిచయం చేసిన మన అందరి మాతృ సంస్థ దేశ వ్యాప్తంగా సర్వవ్యాపి సర్వ స్పర్చగా విస్తరిస్తున్న ఏబీవీపీ సామాజిక రుగ్మతలను రూపుమాపి దేశ భవిష్యత్తులో కీలక పాత్ర పోషిస్తున్న విషయం అభినందనీయం అని యువకులంతా విద్యార్థిని విద్యార్థులు దేశ సేవలో సామాజిక లక్ష్యాల సాధనలో నిమగ్నం కావాలని వారు మాట్లాడడం జరిగింది ఈ కార్యక్రమంలో ఏబీవీపీ పూర్వ విద్యార్థులు గంగిశెట్టి నాగరాజు, గోలి లింగం, బొడ్డుపల్లి, శ్రీనివాస్, నోముల పరమేష్ గౌడ్, జబ్బు కృష్ణ యాదవ్, నోముల రమేష్ గౌడ్, రాము యాదవ్, రాసమోల సాయి, నోముల శంకర్ గౌడ్, ఎలిజాల శరత్ లోకేష్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# కదం తొక్కిన కార్మిక లోకం....

- జిల్లా వ్యాప్తంగా రహదారుల దిగ్బంధం
- నిరసనలతో హోరెత్తిన మండల కేంద్రాలు
- నాలుగు లేబర్ కోడులను కేంద్రం రద్దు చేయాలి
- కార్మికుల హక్కులను కేంద్రం కాపాడాలి
- కార్మికులకు కనీస పనికి కనీస వేతనం అందించాలి
- ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు చేయొద్దు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా, జాతీయ అఖిలభారత సార్వత్రిక సమ్మె కోసం పిలుపునిచ్చిన సందర్భంగా కార్మికులంతా ఏకమై, జిల్లా వ్యాప్తంగా రహదారుల దిగ్బంధం చేసి ర్యాలీలు నిరసనలు తెలుపుతూ కదం తొక్కారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన అఖిలభారత సార్వత్రిక సమ్మెలో కార్మికులంతా విధులకు గైహాజరై సమ్మెలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడులను వ్యతిరేకిస్తూ, బుధవారం రంగారెడ్డి జిల్లాలోని మండల కేంద్రాలలో నిరసనలు హోరెత్తాయి. కేంద్రంలోని బీజేపీ సర్కార్ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దుచేయాలన్నారు. 12 గంటల పని దినాలు పనిచేసే ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని హెచ్చరించారు. కార్మిక హక్కులను కాలరాసే విధంగా బిజెపి ప్రభుత్వం పునుకుందన్నారు. కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వర్గం పైన రైతుల పైన దాడి చేయడం మొదలు పెట్టారని, కార్మికులు పోరాడి సాధించుకున్న 44 రకాల చట్టాలను, పెట్టుబడి వర్గానికి కొమ్ముకాస్తూ నాలుగు కోడ్ లుగా చేసి కార్మిక వర్గానికి తీరని అన్యాయాన్ని చేశారని, 29 రకాల చట్టాలను పునరుద్ధరించాలని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ రంగ సంస్థలను అప్పనంగా ప్రైవేటు కార్పోరేట్లకు అప్పజెప్పడం సరికాదని వాపోయారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా దిగివచ్చి కార్మికులకు అండగా నిలవాలని, కార్మికుల హక్కులను కాపాడాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమ్మె మరింత తీవ్రతరం చేస్తామని జిల్లా సిఐటియు నాయకులు హెచ్చరించారు.



## ఇన్స్పెక్టర్ యంఏ షుకూర్ కు ఉత్కృష్ట సేవా పతకం

**వరంగల్ మహా;** వరంగల్ ఇంతే జార్గంజ్ పోలీస్ ఇన్స్పెక్టర్ యంఎ షుఖూర్ కు అరుదైన గౌరవం దక్కింది. పోలీస్ విధి నిర్వహణలో చూపిన నిబద్ధత, నిజాయితీకి పోలీస్ శాఖలో ఆయన చేసిన ఉత్తమ సేవలకు గాను ఉత్కృష్ట కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డు కు ఇన్స్పెక్టర్ యం షుఖూర్ ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పోలీసు ఉన్నతాధికారుల తోపాటు సహచర ఇన్స్పెక్టర్లు, సిబ్బంది, పలువురు ప్రముఖులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ANN తెలుగు
మహా పత్రిక 06
గురువారం, హైదరాబాద్ | 10-07-2025 | జిల్లా వార్తలు | DISTRICT NEWS | WWW.MAHAADAILY.COM

## ఆజంనగర్‌లో ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభం

**కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజారోగ్యంపై ప్రధాన దృష్టి.. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

**భూపాలపల్లి, మహా :** ప్రజారోగ్యంపై సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం భూపాలపల్లి మండలం ఆజం నగర్ గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. గ్రామంలో జాతీయ ఆరోగ్య మిషన్ నిధులు రూ.16 లక్షలతో నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్ర భవనాన్ని ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఆర్టికల్ 275(I) నిధులు రూ.14 లక్షలతో ప్రైమరీ హెల్త్ సెంటర్లో నూతనంగా నిర్మించిన బర్త్ వెయిటింగ్ గదిని కూడా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి సీఎం గా బాధ్యతలు చేపట్టిన తరువాత మునుపెన్నడూ లేనివిధంగా ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. అదేవిధంగా, ఆసుపత్రులకు నిధుల కేటాయింపులు, నియామకాలపై దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఆసుపత్రిలో రికార్డులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆసుపత్రిలో అన్ని వివరాలను సక్రమంగా రికార్డులో రోజు వారిగా నమోదు



చేయాలని డాక్టర్లకు, సిబ్బందికి సూచించారు.

**పంబాపూర్ భీమ్ ఘనపూర్ చెరువు నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే..**

భూపాలపల్లి మండలం పంబాపూర్ గ్రామంలోని భీమ్ ఘనపూర్ చెరువు నీటిని దిగువన ఉన్న పంట పొలాలకు నీటిపారుదల శాఖ ఈఈ ప్రసాద్ ఇతర అధికారులు, కాంగ్రెస్ నేతలతో కలిసి ఎమ్మెల్యే నీటిని విడుదల చేశారు. ముందుగా తూము వద్ద ఎమ్మెల్యే టెంకాయ కొట్టి, తూము గేట్ వాల్వ్ ను తిప్పి కిందికి నీటిని వదిలారు. పలువురు ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి సన్మానం చేశారు.

## అతి ఉత్కృష్ట సేవా పథకం కు జిల్లా అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్ ఎంపిక

**భూపాలపల్లి, మహా :** భూపాలపల్లి అడిషనల్ ఎస్పీ అంగోత్ నరేష్ కుమార్ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అందించే అతి ఉత్కృష్ట సేవా పతకానికి ఎంపికయ్యారు. గత 34 సంవత్సరాలుగా పోలీస్ శాఖలో ఉత్తమ సేవలందిస్తు, సమర్థవంతమైన ఇన్వెస్టిగేషన్ తో నిందితులకు జీవిత ఖైదు పడే విధంగా కృషి చేయడంతో నరేష్ కుమార్ ను ప్రభుత్వం ఈ పథకానికి ఎంపిక చేసింది. గతంలో నరేష్ కుమార్ సేవా పథకం, కఠిన సేవా పథకంతో పాటు, ప్రెసిడెంట్ గ్యాలంటరీ మెడల్ ను అందుకున్నారు.



పోలీసు శాఖలో 1991లో ఎస్ఐగా ఎంపికయిన నరేష్ కుమార్ అంచలంచెలుగా ఎదిగారు. 2006లో సీఐగా, 2017లో డీఎస్పీగా ప్రమోషన్ పొంది, మహబూబాబాద్, మామునూర్ ఏసీపీ గా విధులు నిర్వర్తించారు. 2023 లో అడిషనల్ ఎస్పీ గా పదోన్నతి పొంది, ఖమ్మం పోలీసు కమిషనరేట్ లో అడిషనల్. డీసీపీగా విధులు నిర్వర్తించారు, తాజాగా భూపాలపల్లి జిల్లా అదనపు ఎస్పీ గా విధులు నిర్వహిస్తున్నారు. తాజాగా అతి ఉత్కృష్ట సేవా పథకానికి ఎంపికైన అదనపు ఎస్పీ నరేష్ కుమార్ ను జిల్లా ఎస్పీ శ్రీ కిరణ్ ఖరే ఐపీఎస్ అభినందించారు.

## పలిమెల మండలంలో పెరిగిన 3 ఎంపీటీసీ స్థానాలు

**కాటారం, మహా :** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సన్నాహాలు వేగవంతం అయ్యాయి. ఇప్పటికి గ్రామపంచాయతీల సరిహద్దులపై ప్రభుత్వానికి నివేదిక పంపించిన అధికారులు గ్రామాల్లో వార్డులు ఖరారు చేశారు. తాజాగా ఎంపిటిసి స్థానాల పునర్విభజనకు షెడ్యూల్ను మంగళవారం ప్రకటించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండల పరిషత్తులో 3 ఎంపీటీసీ స్థానాలు పెరిగినాయి. కొత్త ఎంపిటిసి స్థానాలు ఏర్పాటు చేసేందుకు డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇచ్చినట్టు ఎంపీడీవో ప్రకాష్ తెలిపారు. ఇప్పుడు లెక్కలగడ్డ, పంకెన ఎంపీటీసీ స్థానాలు మాత్రమే ఉన్నాయి. కొత్తగా మండలంలో పలిమెల, దమ్మూరు, నీలంపెల్లి పంచాయతీలలో కొత్తగా ఎంపీటీసీ స్థానాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. కనీసం ఐదు ఎంపిటిసి




స్థానాలు ఉండాలని ప్రభుత్వం నిబంధన పెట్టింది. 8 జి పి లు ఉండగా 5,571 మంది ఓటర్లున్నారు. కొత్త ఎంపిటిసి స్థానాల కోసం 8వ తేదీన ముసాయిదా జాబితా విడుదల చేయగా, బుధవారం అభ్యంతరాలను సేకరిస్తారు. గురు, శుక్రవారాలలో అభ్యంతరాలను పరిష్కరిస్తారు. శనివారం 12వ తేదీన తుది జాబితా విడుదల చేస్తారు.

## చిన్న కాలేశ్వరం పైప్ లైన్ల తవ్వకం ప్రారంభం

**కాహారం,మహా:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని చిన్న కాళేశ్వరం స్టేజి 2 లో పైపులైన్ తవ్వకాల పనులను బుధవారం ప్రారంభించారు. గారేపల్లిలోని పంపు హౌస్ నుండి ఆదివారం పేట గ్రామానికి వెళ్లే ప్రధాన పైపులైను నిర్మాణం పనులను జెసిబి తవ్వకం తో ప్రారంభించారు. కాటారం గ్రామ శివారులోని 501, 418 సర్వే నెంబర్ల పరిధిలో పైప్ లైన్ నిర్మాణం జరిగే ప్రదేశంలో భూ నిర్వాసిత రైతులతో సబ్ కలెక్టర్ మయంక్ సింగ్, కాటారం డిఎస్పి సూర్యనారాయణ క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులు అడ్డంకులు చెప్పకుండా ఒప్పించారు. కాటారం నుండి ఆదివారం పేట గ్రామం వరకు 3.33 కిమీ పైపులైన్లు లలో 130 మీటర్ల మేరకు వేయాల్సిన పైప్ లైన్ ను బుధవారం ప్రారంభించారు.



## హైదరాబాద్ బీజాపూర్ హైవే దిగ్బంధం

- నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలి
- చేవెళ్ల పట్టణ కేంద్రంలో ర్యాలీ నిరసన
- కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలి
- ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ ఆపాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** బుధవారం అఖిల భారత సార్వత్రిక సమ్మెలో భాగంగా చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ అధ్యక్షతన, అఖిలభారత సార్వత్రిక సమ్మెలో భాగంగా ర్యాలీ నిరసన, హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రహదారి దిగ్బంధం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య హాజరై మాట్లాడుతూ... కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వర్గం పైన రైతుల పైన దాడి చేయడం మొదలు పెట్టారని, కార్మికులు పోరాడి సాధించుకున్న 44 రకాల చట్టాలను, పెట్టుబడి దారి వర్గానికి కొమ్ము కాస్తూ నాలుగు కోడ్ లుగా చేసి కార్మిక వర్గానికి తీరని అన్యాయాన్ని చేశారని, 29 రకాల చట్టాలను పునరుద్ధరించాలని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ రంగ సంస్థలను అప్పనంగా ప్రైవేటు కార్పోరేట్లకు అప్పచెప్పుతున్నాడని వాపోయారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోజు రోజుకు ప్రజల యొక్క కొనుగోలు శక్తి తగ్గిపోతుందని, నిత్యవసర వస్తువుల




ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతుంటే దానికి భిన్నంగా భారతదేశంలో గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలు పెరుగుతున్నాయని తెలిపారు. అదేవిధంగా దేశంలో నిరుద్యోగం, పేదరికం పెరిగిపోతుందని, రైతుల ఆకలి చావులు ఆగటం లేదని, మరి దేశం ఎలా వెలిగిపోతుందో మోడీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జిల్లా అధ్యక్షుడు కే రామస్వామి మాట్లాడుతూ... కార్మికులకు కనీస వేతనం నెలకు 26వేల రూపాయలు ఇవ్వాలని, స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలని, కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలని భవన నిర్మాణ రంగ కార్పొరేషన్ను పునరుద్ధరించాలని, కనీస వేతనాల చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, కార్మికులకు ఎస్ఐపిఎఫ్ ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ప్రభులింగం, కౌన్సిల్ సభ్యులు సుధాకర్ గౌడ్, సుభాన్ రెడ్డి, నాలుగు మండలాల కార్యదర్శులు ఏం సత్తిరెడ్డి, కే శ్రీనివాస్, సుధీర్, శ్రీశైలం, ఇన్ సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బుల్, బికేఎంయు జిల్లా అధ్యక్షుడు జే అంజయ్య, ఎన్ఎఫ్ఐ డబ్ల్యు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, మీనాక్షి, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు గోపాల్ రెడ్డి, బిఓసి జిల్లా నాయకుడు జె శ్రీనివాస్, బోనాల ప్రభాకర్, యాదగిరి, లలిత, అనెక్స్ గ్లాస్ కంపెనీ కార్మికులు పాల్గొన్నారు.

# యాజమాన్యాల కోసమే లేబర్ కోడ్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు స్వప్న డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సందర్భంగా ఇబ్రహీంపట్నంలో బుధవారం సిఐటియు మండల కన్వీనర్ సిహెచ్ బుగ్గరాములు ఆధ్వర్యంలో సాగర్ హదారిపై కార్మికులతో ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. సమ్మెకు ప్రజాసంఘాలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు స్వప్న మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ సర్కార్ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దుచేయాలన్నారు. 12 గంటల పని దినాలు పనిచేసే ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని హెచ్చరించారు. కార్మిక హక్కులను కాలరాసే విధంగా బిజెపి ప్రభుత్వం పునుకుందన్నారు. కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదన్నారు. అనేక పోరాటాల ఫలితంగా మే డే స్ఫూర్తితో



ఎనిమిది గంటల పని దినం అమలులోకి వచ్చిందని గుర్తు చేశారు. పెట్టుబడిదారుల కోసం, కార్పొరేట్లకు అనుకూలంగా కార్మికుల నుంచి శ్రమదోపిడి చేయడం కోసమే ఈ పని గంటలు పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిటిష్ కాలం నుంచి ఇప్పటి వరకు 29 కార్మిక చట్టాలను పోరాడి సాధించుకుంటే, వాటిని కాలరాస్తూ మోడీ తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్ లు కార్మిక నడ్డి విరిసేందుకేనని విమర్శించారు. లేబర్ కోడ్ లు అమలు అయితే కార్మికులకు ఎలాంటి హక్కులు ఉండయన్నారు. ఉద్యోగ భద్రత, ఈఎస్, పిఎఫ్ తో పాటు కనీస సౌకర్యాలు కల్పించేది లేబర్ కోడ్ లలో లేవన్నారు. ఈ నాలుగు లేబర్ కోడ్ లు యాజమాన్యాలకు అనుకూలమైనదన్నారు. కార్మిక హక్కులను కాలరాస్తూ తీసుకువస్తున్న లేబర్ కోడ్ లను రద్దు చేయాలి. 8 గంటల పని దినాన్ని కేంద్ర ప్రభుత్వం 12 గంటల అమలు చేయాలని ఆలోచన విరమించుకోవాలన్నారు. 10 గంటల పని దినాలను అమలుకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన 282 జీవోను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను సంక్షేమ పథకాలను అమలు చేయకుండా ఇలాంటి చర్యలు పూనుకోవడం సరైనది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలి. 8గంటల పని దీనిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశవ్యాప్తంగా కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహించాల్సి వస్తుందని ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎల్లేశ, బుగ్గరాములు, ప్రజాసంఘాల నాయకులు సామెల్, జంగయ్య, జగన్, విజయమ్మ, వెంకటేష్, ముసలయ్య, పురుషోత్తం, శంకర్, ఆనంద్, గణేష్, వీరేష్, నరసింహ, వంశీ, తరంగ్, కార్మికులు లక్ష్మయ్య, బేబీ, యాదయ్య, రాధా, జయమ్మ, చంద్రకళ, మన్నెమ్మ, దేవదాస్, సత్యనారాయణ, శ్రీకాంత్, యాదగిరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిరీక్షణలో విగ్రహాలు

**విగ్రహాల ముసుగు తొలిగేదెప్పుడు?**

**ఐదు నెలలుగా ఆవిష్కరణకు నోచుకోని మహనీయుల విగ్రహాలు**

**షాద్ నగర్, మహా:** కాలం కరిగిపోయే... కవర్లు చిరిగిపోయే... ముసుగు తొలగి వెలుగు చూపేదెప్పుడు...? వారి సందేశం జనంలో నింపేదెప్పుడు..? ఆ శుభ ఘడియకై మహనీయుల విగ్రహాలు ముసుగు తొలిగేదెప్పుడు... అన్నట్లు ప్రారంభానికి నోచుకోక 5 నెలలుగా ముసుగులో దాగి ఆవిష్కరణకు ఎదురు చూస్తున్నాయి మహనీయుల విగ్రహాలు... షాద్ నగర్ పట్టణ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణ ముందు ఆరుగురి మహనీయుల విగ్రహాలను ప్రారంభోత్సవానికి సిద్ధం చేసి ఐదు నెలలు గడిచిపోయాయి... అయినా నేటికీ ఆ విగ్రహాలు ప్రారంభానికి నోచుకోలేకపోయాయి. ఈ ఐదు నెలల కాలంలో ఆ విగ్రహాలకు కట్టిన ముసుగు కవర్లు పదే పదే చినిగిపోయి స్వతహాగా ఆవిష్కరణ జరిగిపోతున్నాయి. అయినా తమ ప్రారంభోత్సవానికి జాప్యం ఎలా



నాయకా... అంటూ నిత్యం ఎంపీడీవో కార్యాలయం సముదాయంలోకి వచ్చిపోయే ప్రజా ప్రతినిధులు, అధికారులను ప్రశ్నిస్తున్నట్లు కట్టిన ముసుగులో నుంచి అప్పుడప్పుడు తొంగి చూస్తూ అందరిని మేలుకొలిపే విధంగా విగ్రహాలు దర్శనమిస్తున్న ఎవరు పట్టించుకోకపోవడం నిజంగా విడ్డురమే కదా... అధికారులు స్పందిస్తారో... ప్రజాప్రతినిధులు స్పందిస్తారో... లేక ఆ మహనీయులే తమ ముసుగును తొలగించుకుంటారో వేచి చూద్దాం...

## ఆరేళ్ల బాలిక కిడ్నాప్ కేసును చేదించిన పోలీసులు

**పోలీసుల అదుపులో నిందితురాలు రంగాపురం రజిని**

**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ ఆర్జిఐ పోలీసులు 24 గంటల వ్యవధిలోనే ఆరేళ్ల బాలిక కీర్తన కిడ్నాప్ కేసును చేదించారు. కిడ్నాప్ కి గురైన కీర్తనను నిందితురాలు రంగపురం రజిని అనే మహిళ శంషాబాద్ ఆర్జిఐ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాలగూడలో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంది. మంగళవారం శంషాబాద్ కల్లు కాంపౌండ్ లో ఆరేళ్ల బాలిక కీర్తన కిడ్నాప్ కు గురైన సంఘటన తెలిసిందే. పోలీసుల విచారణలో భాగంగా వికారాబాద్ లో కీర్తన నిందితురాలైన రంగాపురం రజిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆరేళ్ల బాలిక కీర్తనను కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిందితురాలు రంగాపురం రజిని ని పోలీస్ స్టేషన్ కు తరలించారు. 24 గంటల్లోనే కిడ్నాప్



కేసును చేదించిన ఆర్జిఐ పోలీస్ స్టేషన్ సీఐ బాలరాజు తో పాటు ప్రత్యేక బృందాలను ఉన్నతాధికారులు అభినందించారు.

## ఎడతెరిపి లేని వర్షం..



- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు.. నిండుకున్న చెరువులు
- పలు సాగునీటి ప్రాజెక్టులకు జలకళ
- వారం రోజులుగా వ్యవసాయ పనులకు ఆటంకం
- ఇబ్బందులు పడుతున్న చిరు వ్యాపారులు

**ఆదిలాబాద్, మహా:** ఆదిలాబాద్ జిల్లాలో మొన్నటి వరకు వర్షం లోటు వర్షపాతం నమోదు కాగా.. తాజాగా వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో సాధారణ స్థాయికి చేరుకుంది. రోజూ వర్షం రావడం మూలంగా జనజీవనానికి అవాంతరాలు ఎదురవుతున్నాయి. ఈ సీజన్లో జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు 281.1 మి.మి వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 309 మి.మి వర్షం కురిసింది. సాధారణం కంటే కొంత అధికంగానే వర్షం కురవడం గమనార్హం. రోజూ ఏదో ఒక సమయంలో వర్షం రావడంతో వ్యవసాయ పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. పొలాలు బురదమయంగా ఉండటం..కొన్ని చోట్ల చేన్లలోకి నీళ్లు రావడంతో పొలం పనులు సాగడం లేదు. మరోపక్క కొద్దిపాటి విరామం తప్పితే ఎడతెరిపి లేకుండా కురుస్తుండటంతో చిరు వ్యాపారులు, వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు ఇబ్బందులకు గురవుతున్నారు.

**ప్రాజెక్టులకు జలకళ..**

జిల్లాలో ఎడతెరిపిలేని వర్షాలతో పాటు ఎగువన మహారాష్ట్ర ప్రాంతంలో వర్షాలు కురుస్తుండటంతో జిల్లాలోని నదులు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దున ఉన్న పెన్‌గంగా నది ఉధృతంగా ప్రవహస్తోంది. సాత్నాల, మత్తడివాగు, స్వర్ణ, కడెం తదితర సాగు నీటి ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. జిల్లాలో కురుస్తున్న వర్షానికి తోడు ఎగువ నుంచి వరద నీరు వస్తుండటంతో అధికారులు ఆయా ప్రాజెక్టుల గేట్లు కొన్నింటిని ఎత్తివేసి నీటిని దిగువకు వదులుతున్నారు. చెరువులు, కుంటలు నిండుకుండను తలపిస్తున్నాయి. జిల్లాలోని కుంటాల, పొచ్చెర, కనకాయి, గాయత్రి వంటి జలపాతాలు పరవళ్లు తొక్కుతున్నాయి. చూపరులను కనువిందు చేస్తున్నాయి.

**వ్యవసాయ పనులకు ఆటంకం**

జిల్లాలో కురుస్తున్న వర్షంతో ప్రాజెక్టులు, చెరువులు నిండుతున్నా వ్యవసాయ పనులకు మాత్రం ఆటంకం కలుగుతోంది. గత వారం రోజుల నుంచి రోజూ మధ్యాహ్నం నుంచి వర్షం ప్రారంభం కావడంతో పొలం పనులు సాగడం లేదు. ఫలితంగా ఎరువులు వేయలేని పరిస్థితితో పాటు అరక కూడా సాగడం లేదు. దీంతో పత్తి, సోయా తదితర పంటల్లో కలుపు మొక్కలు పెరగడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కొన్ని చోట్ల పంట పొలాల్లో వర్షపునీరు నిల్వడంతో రైతులు వాటిని బయటకు పంపించేందుకు ఆపసోపాలు పడుతున్నారు. మరోపక్క రోజువారీగా వర్షం కురుస్తుండటం కారణంగా రోడ్లపక్కన వ్యాపారులు చేసుకొని జీవించే అనేక మంది చిరు వ్యాపారులు ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణ వాసులు సైతం బయటకు వెళ్లేలేని పరిస్థితి ఉండటంతో వ్యాపారానికి నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లే వారు సైతం వర్షం కారణంగా ఇంటికే పరిమితం కావాల్సి వస్తోంది. మరో రెండు రోజుల పాటు ఇదే మాదిరి వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

## సూక్ష్మ ప్రణాళిక నివేదికను సమర్పించండి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద**



**వరంగల్ మహా;** వరంగల్ సూపర్ స్పెషాలిటీ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి ఆయా క్లినికల్ విభాగాల్లో వసతుల కేటాయింపునకు సంబంధించిన వివరాలతో కూడిన సూక్ష్మ ప్రణాళిక నివేదికను 15 రోజుల్లో సమర్పించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద వైద్య అధికారులను ఆదేశించారు. బుధవారం వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లోని సమావేశపు హాలులో వైద్యాధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సమావేశమై నిర్మాణ పనులను, పీడియాట్రిక్స్, జనరల్ సర్జరీ రేడియాలజీ పాథాలజీ ఫోరెన్సిక్, అనిస్థీషియా బయో కెమిస్ట్రీ ఫోరెన్సిక్ మెడిసిన్, తదితర క్లినికల్ విభాగాలకు భవనాలలో కేటాయించిన అంతస్తుల వారిగా గదులు, ఇతర విభాగాల ఏర్పాటు కొరకు కావలసిన గదులు, సంబంధిత క్లినికల్ విభాగాల కు అవసరమగు మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం సూపర్ స్పెషాలిటీ భవనంలో ప్రాథమికంగా కేటాయించిన ఆసుపత్రిలోని వివిధ అంతస్తులలో వివిధ విభాగాల వైద్యాధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో కలెక్టర్ క్షేత్ర స్థాయిలో అంతస్తుల వారిగా ఆయా క్లినికల్ విభాగాలకు కేటాయించిన గదులను పరిశీలించి సమర్ధ వంతంగా నిర్వహించుటకు కావలసిన సదుపాయాల గురించి సూక్ష్మ ప్రణాళిక నివేదికను సమర్పిచాలని ఆదేశించారు. ఎంజీఎం ఆసుపత్రిలో పనిచేస్తున్న వివిధ పరికరాలను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించాలన్నారు. ఇందుకు అవసరమగు కొత్త పరికరాలు సంబంధిత శాఖ ద్వారా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఏ అంతస్తులో ఏయే విభాగాల్లో వసతులు ఉండాలో ఆ సూక్ష్మ ప్రణాళికలో ఉండాలన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో నివేదించే సూక్ష్మ ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజిఎం సుపరింటెండెంట్ కిశోర్, ఎల్ అండ్ టి అధికారి శరవరన్, జిల్లా ఆర్ అండ్ బి. అధికారి రాజేందర్, టీఎస్ ఎంఐడిసి డీఈ, ఆర్ఎంవోలు, వివిధ విభాగాల వైద్య శాఖాధిపతులు, తదితరులు, పాల్గొన్నారు.

## గ్రామీణ బంద్ సక్సెస్..

**లేబర్ కోడ్ లు రద్దు.. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి**

**కలెక్టరేట్ ఎదుట కదం తొక్కిన కార్మికులు.. జోరు వర్షంలోనూ నిరసన ప్రదర్శన**

**ఆదిలాబాద్, మహా:** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త గ్రామీణ బంద్ విజయవంతమైంది. కార్మిక సంఘాల పిలుపు మేరకు బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కదం తొక్కారు. కలెక్టరేట్ ఎదుట జోరు వర్షంలోనూ నిరసన తెలిపారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, ఐఎఫ్టీయూ, టీయూసీఐ, ఏఐకేఎస్, వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా, ఎన్పీఆర్డీ తదితర సంఘాలన్ని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తీరును తీవ్రంగా తప్పుపట్టాయి.




**కార్మిక కోడ్ లు రద్దు చేయాలి**

కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల స్థానంలో కోడ్ లుగా మార్చి కార్మికులకు తీరని అన్యాయం చేస్తోందని ఆయా కార్మిక సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు మార్కెట్లో గిట్టుబాటు ధర కల్పించాలని ఇందుకు చట్టం చేయాలని స్పష్టం చేశారు. కార్మికుల 8గంటల పని విధానాన్ని 12గంటలకు పెంచి శ్రామికుల శ్రమ దోపిడికి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. లేబర్ కోడ్ లతో సంఘం పెట్టుకునే హక్కును కూడా కార్మికులు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు అన్నమోల్ల కిరణ్, విలాస్, సిర్ర దేవేందర్, జగన్ సింగ్, మునిగెల నర్సింగ్, వెంకట్ నారాయణ, బండి దత్తాత్రి, లంక రాఘవులు, ఆశాలత, అగ్గిమల్ల స్వామి, దర్శనాల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలి

**సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు దర్శనాల మల్లేష్**

**ఆదిలాబాద్, మహా:** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కారు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం మానుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు దర్శనాల మల్లేష్, అంగన్వాడీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కె.సునీత డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలో ఐటీడీఏ ఎదుట నిరసన తెలిపారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్ లు తీసుకురావడం ద్వారా వేతనం, సంఘం పెట్టుకునే హక్కులు కాలరాయబడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ అధికారంలోకి వచ్చిన నుండి కార్పొరేట్ లకు రూ.16 లక్షల 35 వేల కోట్లు మాఫీ చేశారని విమర్శించారు. అంగన్వాడి, ఆశా గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కరించాలని మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని స్పష్టం చేశారు.

# ఆధార్ పౌరుల తొలి గుర్తింపు కాదు

బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కోసం ఆమోదయోగ్యమైన గుర్తింపు పత్రాల నుంచి ఆధార్‌ను మినహాయించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) సీఈఓ భువనేష్ కుమార్ స్పష్టతనిచ్చారు. ఆధార్ పౌరుల తొలి గుర్తింపు కాదని చెప్పారు. ప్రభుత్వ సర్వీసులు సులువుగా పొందేందుకు వీలుగా దీన్ని రూపొందించినట్లు తెలిపారు. ఓ మీడియా సంస్థతో ప్రత్యేకంగా మాట్లాడిన కుమార్ నకిలీ ఆధార్ కార్డులను తనిఖీ చేసి వాటిని గుర్తించేందుకు యూఐడీఏఐ చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. ఆధార్ కార్డులకు క్యూఆర్ కోడ్ ద్వారా ఇంటర్నల్ భద్రతా యంత్రాంగం ఉందని పేర్కొన్నారు. జారీ చేసిన అన్ని కొత్త ఆధార్ కార్డులపై క్యూఆర్ కోడ్ ఉందని, యూఐడీఏఐ అభివృద్ధి చేసిన ఆధార్ క్యూఆర్ స్కానర్ యాప్ త్వరలో అందుబాటులో ఉంటుందన్నారు. ఈ యాప్ ద్వారా ఆధార్ కార్డులోని వివరాలను క్యూఆర్ కోడ్‌లో పొందుపరిచిన వాటితో సరిపోల్చుకోవచ్చని చెప్పారు. ఎవరైనా నకిలీ ఆధార్ కార్డు చూపిస్తే దీని ద్వారా సులభంగా చెక్ చేయవచ్చని తెలిపారు. ఫొటోషాప్ లేదా ప్రింటెడ్ టెంప్లెట్లను ఉపయోగించి ప్రజలు నకిలీగా ఆధార్ కార్డులను సృష్టిస్తున్న సందర్భాలున్నాయని కుమార్ వివరించారు. కొత్త ఆధార్ యాప్ అభివృద్ధి చివరి దశలో ఉందని వెల్లడించారు. 'ఇప్పటికే ఈ యాప్‌కు డెమో నిర్వహించారు. ఇది పురోగతిలో ఉంది. అంతర్గతంగా దాన్ని చెక్ చేస్తున్నారు. ఈ యాప్ ప్రాథమికంగా ఆధార్ నంబర్ హోల్డర్ సమ్మతితో డిజిటల్ పద్ధతిలో ఐడెంటిటీని పంచుకోవడానికి అనుమతిస్తుంది. ఈ కొత్త యాప్ ద్వారా ప్రజలు తమ ఆధార్ కార్డుల ఫిజికల్ కాపీలను షేర్ చేసుకోవాల్సిన అవసరం ఉండదు. ఇందులో మాస్క్‌డ్ వెర్షన్ కూడా ఉంటుంది' అన్నారు.

జూన్ 24న ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం జులై 25 నాటికి బిహార్‌లో దాదాపు 8 కోట్ల మంది ఓటర్లలో అనర్హుల పేర్లను తొలగించి, అర్హులైన పౌరుల జాబితానే సిద్ధం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల వరకు ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపేయాలని రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) నేత తేజస్వి యాదవ్ ఎన్నికల సంఘాన్ని కోరారు. రాష్ట్రం అంతటా విస్తృతంగా ఉన్న ఆధార్, ఎంఎన్ఆర్ఈజీఏ జాబ్ కార్డులను గుర్తింపు రుజువుగా అంగీకరించకపోవడం వల్ల ఓటర్లు అసౌకర్యానికి గురవుతున్నారని రాష్ట్ర అసెంబ్లీలో ఆయన తెలిపారు.






## యాపిల్ కొత్త సీఓఓ మనోడే..

ప్రపంచ దిగ్గజ కంపెనీ యాపిల్ కొత్తగా చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా భారత సంతతికి చెందిన సబీహ్ ఖాన్‌ను నియమించింది. ఇప్పటి వరకు ఈ స్థానంలో జెఫ్ విలియమ్స్ సేవలందించారు. 2015 నుంచి సీఓఓ పదవిలో ఉన్న జెఫ్ విలియమ్స్ ఇకపై కంపెనీ సీఈఓ టిమ్ కుక్‌కు రిపోర్ట్ చేస్తూ యాపిల్ వాచ్, డిజైన్ బృందాలను పర్యవేక్షించనున్నారు. ఈ ఏడాది చివర్లో విలియమ్స్ పదవీ విరమణ చేసిన తర్వాత డిజైన్ బృందం నేరుగా టిమ్‌కు నివేదిస్తుందని యాపిల్ పేర్కొంది.

### ఎవరీ సబీహ్ ఖాన్..

యాపిల్ సంస్థలో 30 ఏళ్లుగా పనిచేస్తూ, ప్రస్తుతం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ ఆపరేషన్స్‌గా సేవలందిస్తున్న సబీహ్ ఖాన్ ఈ నెలాఖరులో అధికారికంగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో 1966లో జన్మించిన ఖాన్ చదువుకునే రోజుల్లోనే సింగపూర్‌కు మకాం మార్చారు. టఫ్ట్స్ యూనివర్సిటీ నుంచి ఎకనామిక్స్, మెకానికల్ ఇంజినీరింగ్‌లో డ్యూయల్ బ్యాచిలర్ డిగ్రీలు పొందారు. రెన్సెలీర్ పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్ (ఆర్‌పీఐ) నుంచి మెకానికల్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ పట్టా సాధించారు. జీఈ ప్లాస్టిక్స్‌లో తన వృత్తి జీవితాన్ని ప్రారంభించిన తరువాత ఖాన్ 1995లో యాపిల్‌లో చేరారు. అప్పటి నుంచి అతను గ్లోబల్ సప్లై చైన్, సప్లయర్ రెస్పాన్సిబిలిటీ ప్రోగ్రామ్స్, ఆపరేషనల్ స్ట్రాటజీని రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు. యాపిల్ గ్లోబల్ స్ట్రాటజీలో కీలక మార్కెట్‌గా భారత్ ఎదుగుతున్న నేపథ్యంలో ఖాన్ ఈ పదవిని చేపట్టడం గమనార్హం. ఖాన్ భారాస నేత కేటీఆర్ స్నేహితుడు కావడంతో తన ఎక్స్ ఖాతాలో శుభాకాంక్షలు తెలిపారు.

## ఈపీఎఫ్ వడ్డీ జమ.. ఈవారమే




ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) సభ్యుల ఖాతాల్లో పొదుపు నిధిపై.. 2024-25 సంవత్సరానికి 8.25 శాతం వడ్డీ జమను ఈ వారంలోనే పూర్తి చేయనున్నట్టు కేంద్ర కార్మికశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. '33.56 కోట్ల సభ్యులకు సంబంధించిన 13.88 లక్షల సంస్థల వార్షిక అకౌంట్ అప్‌డేషన్ పూర్తయింది. జులై 8 నాటికి 13.86 లక్షల సంస్థలకు చెందిన 32.39 కోట్ల సభ్యుల ఖాతాల్లో వడ్డీ జమ చేయడం ముగిసింది. అంటే ఇప్పటికే 96.51 సభ్యుల ఖాతాలకు వడ్డీ జమైంది' అని మంత్రి వివరించారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సభ్యుల నిధిపై, అంతకుముందు ఆర్థిక సంవత్సరం మాదిరే 8.25% వడ్డీ రేటును ఇవ్వాలని ఈపీఎఫ్‌వో ఫిబ్రవరి 28న నిర్ణయించగా.. కేంద్ర ప్రభుత్వం మే 22న ఆమోదం తెలపడం గమనార్హం. దీంతో జూన్ 6 నుంచే వార్షిక ఖాతాల అప్‌డేషన్ మొదలైనట్టు తెలిపారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి ఆగస్ట్-డిసెంబర్‌లో వడ్డీ జమ జరిగింది.

**వడ్డీ జమయిందో లేదో చూసుకోండిలా..**

**స్టెప్ 1:** ఈపీఎఫ్ఓ అధికారిక వెబ్‌సైట్ ( epfindia.gov.in )సందర్శించండి

**స్టెప్ 2:** అవర్ సర్వీసెస్ > ఫర్ ఎంప్లాయీస్ > మెంబర్ పాస్‌బుక్‌కు వెళ్లండి

లేదా నేరుగా ( passbook.epfindia.gov.in ) లింక్‌ను క్లిక్ చేయండి.

**స్టెప్ 3:** యూఏఎన్, పాస్‌వర్డ్, క్యాప్చా ఉపయోగించి లాగిన్ అవ్వండి.

**స్టెప్ 4:** ఇక్కడ మీ అన్ని మెంబర్ ఐడీలు (మునుపటి, ప్రస్తుత కంపెనీలతో లింక్ అయినవి)కనిపిస్తాయి.

**స్టెప్ 5:** పాస్‌బుక్ చూడటానికి ప్రస్తుత మెంబర్ ఐడీపై క్లిక్ చేయండి

పాస్‌బుక్‌లో ఉద్యోగి కంట్రిబ్యూషన్, కంపెనీ కంట్రిబ్యూషన్, జమ అయిన వడ్డీ కనిపిస్తాయి. దీన్ని పీడీఎఫ్‌గా కూడా డౌన్ లోడ్ చేసుకోవచ్చు.

## కుప్పకూలిన వేదాంత షేర్లు




దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిశాయి.రేంజిబౌండ్ సెషన్ తర్వాత దిశా సంకేతాలు లేకపోవడంతో భారత ఈక్విటీ బెంచ్‌మార్క్ సూచీలు నష్టాల వద్ద స్థిరపడ్డాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 176.43 పాయింట్లు (0.21 శాతం) క్షీణించి 83,536.08 వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 46.4 పాయింట్లు లేదా 0.18 శాతం క్షీణించి 25,476.10 వద్ద ముగిశాయి.

విస్తృత మార్కెట్లలో, నిఫ్టీ మిడ్ క్యాప్ 100 0.13 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.59 శాతం పెరిగాయి. రంగాలవారీగా చూస్తే నిఫ్టీ రియల్టీ, మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్ వరుసగా 1.49 శాతం, 1.4 శాతం, 1.25 శాతం నష్టపోయాయి. నిఫ్టీ ఎనర్జీ, ఐటీ, మీడియా, పీఎస్‌యూ బ్యాంక్, హెల్త్‌కేర్ షేర్లు నష్టాల్లో ముగిశాయి.

అమెరికాకు చెందిన వైస్రాయ్ రీసెర్చ్ తన మాతృసంస్థ రుణభారం తగ్గించుకోవడంతో మైనింగ్ దిగ్గజం వేదాంత షేర్లు 3 శాతానికి పైగా నష్టపోయాయి. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ, ఆటో, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఫార్మా, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ లాభాల్లో ముగిశాయి.

సెన్సెక్స్ లోని 30 షేర్లలో 17 షేర్లు ప్రతికూలంగా ముగిశాయి. అదేసమయంలో హెచ్‌సీఎల్ టెక్, టాటా స్టీల్, టెక్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్, భారత్ ఎలక్ట్రానిక్స్ షేర్లు 2 శాతం వరకు నష్టపోయాయి. బజాజ్ ఫైనాన్స్, హిందుస్థాన్ యూనిలీవర్, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్ గ్రిడ్, ఏషియన్ పెయింట్స్ టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. మార్కెట్ ఒడిదుడుకులను అంచనా వేసే ఇండియా వీఐఎక్స్ 2.09 శాతం క్షీణించి 11.9 పాయింట్ల వద్ద స్థిరపడింది.



## చైనా టెకీలు వెళ్లిపోయినా పర్లేదు..

యాపిల్ వెండార్ల ప్లాంట్లలో పని చేసే చైనా టెకీలు స్వదేశాలకు వెళ్లిపోయినా భారత్‌లో ఐఫోన్ 17 ఫోన్ల ఉత్పత్తి ప్రణాళికలు యథాతథంగానే కొనసాగుతాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. చైనా నుంచి, ఐఫోన్ల తయారీలో కీలకమైన యంత్రపరికరాల దిగుమతులు ఇటీవలి కాలంలో మెరుగుపడ్డట్లు వివరించాయి. భారత్‌లో ఫాక్స్‌కాన్, టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థలు యాపిల్ ఫోన్లను తయారు చేస్తున్నాయి. గత రెండు నెలలుగా ఫాక్స్‌కాన్ ఇండియా యూనిట్లలో పని చేస్తున్న వందలకొద్దీ చైనా నిపుణులు స్వదేశానికి వెళ్లిపోయినట్లు సమాచారం. వీరంతా అసెంబ్లీ లైన్స్, ఫ్యాక్టరీ డిజైన్, ఇతరత్రా సిబ్బందికి శిక్షణనిచ్చే విధులు నిర్వర్తించేవారు. దీనితో ఐఫోన్ల తయారీపై ప్రతికూల ప్రభావం పడొచ్చన్న అంచనాలు నెలకొన్నాయి. కానీ, భారత్‌లో ఐఫోన్ల ఉత్పత్తిని 3.5-4 కోట్ల స్థాయి నుంచి ఈ ఏడాది 6 కోట్లకు పెంచుకోవాలన్న యాపిల్ టార్గెట్‌లో ఎలాంటి మార్పు లేదని సంబంధిత వర్గాలు వివరించాయి.

# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

## త్వరలో ఇండియాతో ట్రేడ్ డీల్



**న్యూయార్క్:** ఇండియాతో అతి త్వరలో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోబోతున్నామని, ఈ విషయంలో ఇప్పటికే చాలా సమీపంలోకి వచ్చామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇతర దేశాల నుంచి అమెరికాలోకి వచ్చే ఉత్పత్తులపై ఎంతమేరకు సుంకాలు విధించబోతున్నామో తెలియజేస్తూ తమ అధికారులు ఆయా దేశాలకు లేఖలు పంపిస్తున్నారని వెల్లడించారు. యునైటెడ్ కింగ్‌డమ్(యూకే), చైనాతో తాజాగా ట్రేడ్ డీల్ కుదిరిందని, ఇకపై భారత్‌తో ఒప్పందానికి చాలా దగ్గరగా వచ్చేశామని అన్నారు.

స్థానిక కాలమానం ప్రకారం సోమవారం ఓ కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడారు. లేఖలు పంపించడం వరకే తమ బాధ్యత అని, తమతో ఒప్పందానికి ముందుకు రావాలో వద్దో ఆయా దేశాలే తేల్చుకోవాలని, తుది నిర్ణయం వారిదేనని పరోక్షంగా స్పష్టంచేశారు. కొన్ని దేశాలు తమ ఉత్పత్తులపై 200 శాతం దాకా సుంకాలు విధిస్తున్నాయని, అమెరికాను దోచుకోవడమే వాటి విధానామా? అని ప్రశ్నించారు. ఇకపై అమెరికాలో ఉత్పత్తులు విక్రయించుకోవాలంటే సుంకాలు చెల్లించకతప్పదని తేల్చిచెప్పారు. భారత్-పాకిస్తాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపేశానని, ఆ ఘనత తనకే చెందాలని ట్రంప్ మరోసారి వ్యాఖ్యానించారు. మాట వినకపోతే వ్యాపారం, వాణిజ్యం నిలిపివేస్తానని హెచ్చరించడంతో ఆ రెండు దేశాలు దారి కొచ్చాయని అన్నారు.

విదేశాలపై ఏప్రిల్ 2న విధించిన సుంకాల తాత్కాలిక రద్దును ట్రంప్ సర్కారు ఆగస్టు 1వ తేదీ దాకా పొడిగించిన సంగతి తెలిసిందే. మరోవైపు ట్రంప్ సంతకంతో అమెరికా ప్రభుత్వం లేఖలు పంపించిన దేశాల జాబితాలో ఇండియా లేకపోవడం గమనార్హం. బంగ్లాదేశ్, బోస్నియా, కాంబోడియా, ఇండోనేషియా, జపాన్, కజకిస్తాన్, మలేషియా, దక్షిణాఫ్రికా, దక్షిణ కొరియా, థాయ్‌లాండ్, టునీయా తదితర దేశాలకు ఈ లేఖలు అందాయి.

### మయన్మార్, లావోస్‌పై 40 శాతం టారిఫ్


మయన్మార్, లావోస్‌పై డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ మోత మోగించారు. రెండు దేశాల ఉత్పత్తులపై 40 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. ఈ మేరకు ఆయా దేశాల అధినేతలకు రాసిన లేఖలను సోషల్ మీడియాలో పోస్టుచేశారు. అలాగే కాంబోడియా, థాయ్‌లాండ్‌పై 36 శాతం, సెర్బియా, బంగ్లాదేశ్‌పై 35 శాతం, ఇండోనేషియాపై 32 శాతం, దక్షిణాఫ్రికా, బోస్నియా, హెర్జిగోవినాపై 30 శాతం, కజకిస్తాన్, మలేషియా, టునీషియాపై 25 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇవి ఆగస్టు 1 నుంచే అమల్లోకి వస్తాయని వెల్లడించారు. ఈ టారిఫ్‌లకు ప్రతీకారంగా అమెరికా ఉత్పత్తులపై టారిఫ్‌లు పెంచే ఆలోచన చేయొద్దని ఆయా దేశాల అధినేతలను సున్నితంగా హెచ్చరించారు. జపాన్, దక్షిణ కొరియా ఉత్పత్తులపై 25 శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే.

### బ్రిక్స్‌పై 10 శాతం సుంకాలు

**బ్రిక్స్ కూటమిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి అక్కసు వెళ్లగక్కారు. తమ దేశాన్ని, కరెన్సీ (డాలర్) ఆధిపత్యాన్ని దెబ్బ తీసేందుకే అది ఆవిర్భవించిందని మంగళవారం ఆరోపించారు. "డాలర్‌కు అంతర్జాతీయంగా ఉన్న విలువను నాశనం చేసేందుకు బ్రిక్స్ దేశాలు ప్రయత్నిస్తున్నాయి. తెలివైన అధ్యక్షుడెవరూ అలా జరగనివ్వరు. అది ఒక పెద్ద ప్రపంచ యుద్ధంలో ఓటమి చవిచూడటం వంటిదే. అలా ఎప్పటికీ జరగనివ్వం. ప్రపంచ కరెన్సీల్లో ఇప్పటికీ, ఎప్పటికీ డాలరే కింగ్. దాని ఆధిపత్యాన్ని సవాలు చేయాలనుకుని బ్రిక్స్ దేశాలు అనుకుంటే, తద్వారా మాతో ఆటలు ఆడాలనుకుంటే అభ్యంతరం లేదు. కానీ అందుకు మూల్యంగా వాటన్నింటిపైనా మరో 10 శాతం సుంకాలు విధించి తీరతాం. కేవలం బ్రిక్స్‌కూటమిలో ఉన్నందుకు అవి చెల్లించాల్సిన భారీ మూల్యమిది. అందుకు అవి సిద్ధంగా ఉన్నాయని నేను భావించడం లేదు" అన్నారు.**

## జూన్‌లో ఎండ ప్రచండమే

**గత నెలలో ప్రపంచవ్యాప్తంగా భారీ ఉష్ణోగ్రతలు .. 12 దేశాల్లో నమోదైన కొత్త రికార్డ్**



నైజీరియా నుంచి జపాన్ దాకా.. పాకిస్తాన్ నుంచి స్పెయిన్ దాకా గత నెలలో ప్రపంచవ్యాప్తంగా భారీగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 12 దేశాల్లో కొత్త రికార్డులు సృష్టించాయి. మరో 26 దేశాల్లో బాగా వేడి నెలగా జూన్ రికార్డుకెక్కింది. యూరోపియన్ మానిటర్ కోపర్‌నికస్ సంస్థకు చెందిన ఏఎఫ్‌పీ విశ్లేషణ ఈ విషయం వెల్లడించింది. యూరప్, ఆసియా, ఆఫ్రికాలో గత నెలలో 79 కోట్ల మంది వేడి ముప్పును ఎదుర్కొన్నారు. బ్రిటన్, చైనా, ఫ్రాన్స్, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఇథియోపియా తదితర 26 దేశాల్లో రెండో అత్యంత వేడి నెలగా జూన్ రికార్డు సృష్టించింది. కాలుష్యం, వాతావరణ మార్పుల కారణంగానే ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరిగిపోతున్నట్లు నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యూరప్‌లో గత నెలలో సాధారణం కంటే 3 డిగ్రీల సెల్సియస్ అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పారిస్, బెల్జియం, నెదర్లాండ్స్ వంటి దేశాల్లో జనం అల్లాడిపోయారు. స్విట్జర్లాండ్, ఇటలీ, స్పెయిన్, బోస్నియా, మాంటెనిగ్రోలోనూ ఇదే పరిస్థితి. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో సాధారణంగా ఎక్కువ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. కోస్తా తీర ప్రాంతాల్లో 1.2 డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి. జపాన్ ప్రజలు హాటెస్ట్ జూన్‌ను చవిచూశారు. దేశంలో 126 ఏళ్ల క్రితం ఉష్ణోగ్రతలను నమోదు చేయడం మొదలైంది. అప్పటి నుంచి అత్యంత వేడి జూన్ నెల ఇదే కావడం గమనార్హం. ఉభయ కొరియా దేశాల్లోనూ సాధారణం కంటే 2 డిగ్రీల ఎక్కువ ఉష్ణోగ్రత నమోదయ్యింది. హాటెస్ట్ జూన్‌గా నిలిచిపోయింది. చైనాలో 40 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జూన్‌లో ఈ స్థాయిలో సూర్యప్రతాపం కనిపించడం ఇదే మొదటిసారి. ఆసియాలోని పాకిస్తాన్, తజకిస్తాన్, ఇరాన్, అఫ్గానిస్తాన్, ఉజ్బెకిస్తాన్, కిర్గిజిస్తాన్‌లోనూ జూన్ నెల అత్యంత వేడి వసంత కాలంగా నిలిచింది. నైజీరియాలో రికార్డ్-బ్రేకింగ్ స్థాయి ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, దక్షిణ సూడాన్, కామెరూన్, కాంగో, ఇథియోపియాలోనూ ఇలాంటి పరిణామమే ఎదురయ్యింది.

## ఎప్‌స్టీన్ ఫైల్స్ ఎక్కడ?.. ట్రంప్‌పై మస్క్ కొత్త దాడి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ మధ్య విభేదాలు ఇప్పట్లో చల్లారేలా కనిపించడం లేదు. పార్టీని ప్రకటించిన ఎలాన్ మస్క్ తాజాగా మరోమారు ట్రంప్‌పై విరుచుకుపడ్డారు. లైంగిక నేరస్తుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబంధించిన కీలక ఫైల్స్‌ను ప్రభుత్వం ఎందుకు దాస్తున్నదంటూ ఎలాన్ మస్క్ అధ్యక్షుడు ట్రంప్‌ను నిలదీశారు. దీంతో జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైల్స్ వ్యవహారం తాజాగా అమెరికా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. "జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైల్స్‌ను ట్రంప్ బయటపెట్టకపోతే ప్రజలు ఆయనను ఎలా నమ్ముతారు?" అంటూ మస్క్ ట్విట్టర్ వేదికగా ప్రశ్నించారు. తాను కొత్తగా స్థాపించిన అమెరికా పార్టీ అధికారంలోకి వస్తే ఈ కుంభకోణాన్ని బయటపెట్టడానికే తొలి ప్రాధాన్యత ఇస్తానని మస్క్ పేర్కొన్నారు. ఇటీవల అమెరికా న్యాయశాఖ (డీఓజే) జెఫ్రీ ఎప్‌స్టీన్ సంబంధించిన కేసుపై కీలక ప్రకటన చేసింది. ఎప్స్టిన్ నివాసాలలో సోదాలు చేసినా ఎటువంటి క్లయింట్ లిస్ట్ దొరకలేదని, ఇకపై ఈ కేసులో ఎలాంటి సమాచారం వెల్లడించబోమని స్పష్టం చేసింది. దీనిపై మస్క్ తీవ్రంగా స్పందించారు. మీడియా సమావేశంలో ఒక విలేకరి ఇదే అంశంపై ట్రంప్‌ను ప్రశ్నించగా, ఆయన సమాధానాన్ని దాటవేశారు. మీరు ఇంకా ఎప్‌స్టీన్ గురించే మాట్లాడుతున్నారా? అని తిరుగు ప్రశ్నవేశారు. న్యూయార్క్‌కు చెందిన ప్రముఖ ఫైనాన్షియర్ జెఫ్రీ ఎప్‌స్టీన్ సాగించిన దుర్మార్గాల జాబితాను గత ఏడాది న్యూయార్క్ న్యాయస్థానం బట్టబయలు చేసింది. ఈ కేసుకు సంబంధించిన రహస్య పత్రాలను విడుదల చేసే ప్రక్రియలో భాగంగా తొలి విడతగా 40 పత్రాలను విడుదల చేశారు. ఈ కుంభకోణంలో అమెరికా మాజీ అధ్యక్షులు బిల్ క్లింటన్, డొనాల్డ్ ట్రంప్‌ల పేర్లతో పాటు మైకెల్ జాక్సన్ తదితరుల పేర్లు బయటికొచ్చాయి.



# రెజ్యూమ్‌లో టెన్త్ ఫెయిల్

## ఒక్కరోజే రెండు జాబ్ ఆఫర్స్..

నమ్రత శిర్కోదర్ టాలీవుడ్‌లో హీరోయిన్‌గా రాణిస్తే చెల్లి శిల్ప శిరోద్కర్ బాలీవుడ్‌లో కథానాయికగా అలరించింది. హమ్, ఆంఖెన్, పెంచన్ వంటి సినిమాలతో శిల్ప హిందీలో ఫుల్ బిజీ అయింది. అయితే 2000వ సంవత్సరంలో వచ్చిన గజగామిని మూవీ తర్వాత ఆమె వెండితెరకు విరామం ప్రకటించింది. అప్పుడే యూకేకి చెందిన బ్యాంకు ఉద్యోగి అపరేశ్ రంజిత్‌ను పెళ్లాడింది. మొదట్లో ఈ దంపతులు నెదర్లాండ్స్‌కు షిఫ్ట్ అయ్యారు. ఆ తర్వాత న్యూజిలాండ్‌లో సెటిలయ్యారు.

### కోర్సు నేర్చుకున్నా..

ఇక హీరోయిన్‌గా స్టార్‌డమ్ చూసిన శిల్ప.. సినిమాలు మానేశాక ఏం పని చేసిందనే విషయాన్ని తాజాగా బయటపెట్టింది. ఆమె మాట్లాడుతూ.. నేను ఖాళీగా ఉండకుండా బిజీగా గడపాలని న్యూజిలాండ్‌లో హెయిర్‌డ్రెస్సింగ్ కోర్సు నేర్చుకున్నాను. ఇందులో మేకప్, బ్యూటీ గురించి ఉండటంతో యాక్టింగ్‌కు కనెక్ట్ అయి ఉన్నట్లే అనిపించేది. రెండునెలలపాటు సెలూన్‌లో కూడా పని చేశాను. పనిగంటలు సెట్టవకపోవడంతో మానేశాను.

### పదో తరగతి ఫెయిల్ అని రెజ్యూమ్

కార్పొరేట్ సంస్థలో పని చేసిన అనుభవం లేదు కాబట్టి ఇంకేదైనా చేయాలనుకున్నాను. నా భర్తకు నా రెజ్యూమ్ సిద్ధం చేయమని చెప్పాను. అందుకాయన రెజ్యూమ్‌లో ఏమని రాయను? అన్నాడు. అబద్ధాలు చెప్పకుండా నా గురించి ఉన్నది ఉన్నట్లు రాయు. 10th ఫెయిల్ అని, అలాగే సినిమాల్లో పని చేశానని కూడా పేర్కొనమని చెప్పాను. ఆశ్చర్యంగా ఒక్కరోజే నాకు రెండు జాబ్ ఆఫర్స్ వచ్చాయి. డన్ అండ్ బ్రాడ్‌షీట్ కంపెనీలో క్రెడిట్ కంట్రోలర్‌గా ఉద్యోగంలో చేరాను.

### జోక్ కాస్తా నిజమైంది

కానీ ఉద్యోగంలో చేరిన కొంతకాలానికే నాకు అలసటగా అనిపించేది. ఇదే మాట నా స్నేహితురాలికి చెప్తే ప్రెగ్నెంట్ అయ్యావేమో అని జోక్ చేసింది. ఎందుకైనా మంచిదని టెస్ట్ చేసుకుంటే పాజిటివ్ అని తేలింది. కానీ ఆ జర్నీ అంత ఈజీగా సాగలేదు. ఇన్సులిన్ ఇంజక్షన్లు, బరువు తగ్గేందుకు ప్రయత్నాలు.. ఇలా చాలా కష్టాలే పడాల్సి వచ్చింది. అలా నాకు కూతురు అనుష్క పుట్టింది. దాంతో సినిమాలకు మరింత దూరంగా ఉండాల్సి వచ్చింది అని శిల్ప శిరోద్కర్ చెప్పుకొచ్చింది.



# అలియా పేరుతో 77 లక్షల మోసం

## మాజీ పీఏ అరెస్ట్!

బాలీవుడ్ హీరోయిన్ ఆలియా భట్ మాజీ పర్సనల్ అసిస్టెంట్(పీఏ) వేదికా ప్రకాశ్ శెట్టిని పోలీసులు అరెస్ట్ చేశారు. హీరోయిన్ సంతకాలు ఫోర్జరీ చేసి రూ. 77 లక్షల మోసానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఆలియా తల్లి, దర్శకురాలు సోనీ సోనీ రజ్దాన్ ఇచ్చిన ఫిర్యాదుతో వేదిక ప్రకాశ్‌శెట్టిని పోలీసులు అరెస్ట్ చేశారు. 2021 నుంచి 2024 వరకు అలియా వ్యక్తిగత సహాయకురాలిగా వేదిక పని చేసింది. ఆ సమయంలో ఆలియాకు సంబంధించిన ఫైనాన్షియల్ డాక్యుమెంట్లు, పేమెంట్స్, షెడ్యూల్ ప్లానింగ్‌లను వేదికనే చూసుకునేది. అదే సమయంలోనే వేదికా నకిలీ బిల్లులు సృష్టించి ఆలియా సంతకాన్నీ మార్ఫింగ్ చేసి ఈ మోసానికి పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఐదు నెలల క్రితమే వేదికపై ఆలియా తల్లి ఫిర్యాదు చేసింది. ఈ విషయం తెలిసిన వెంటనే సోనియా ముంబై నుంచి పారిపోయింది. రాజస్తాన్, కర్ణాటక, పుణెల్లో తిరుగుతూ.. చివరకు బెంగళూరులో పోలీసులకు చిక్కింది. ఆమెను అరెస్ట్ చేసి ముంబైకి తరలించినట్లు పోలీసులు తెలిపారు.





## సమంత భుజంపై చేయేసిన రాజ్..

# లవ్‌లో ఉన్నట్లు హింటిచ్చేశారా?

స్టార్ హీరోయిన్ సమంత ఇటీవల తానా వేడుకల కోసం అమెరికా వెళ్లింది. మొదటి సినిమా నుంచి తెలుగు ప్రేక్షకులు తనను ఆదరిస్తూనే ఉన్నారంటూ భావోద్వేగానికి లోనైంది. తెలుగువారికి తన హృదయంలో ప్రత్యేక స్థానం ఉందని పేర్కొంది. ఈ వేడుకల అనంతరం సామ్ అమెరికాలో వెకేషన్ ఎంజాయ్ చేస్తున్నట్లు కనిపిస్తోంది.

### రాజ్‌తో అమెరికాలో చెట్టాపట్టాల్

అమెరికాలోని డెట్రాయిట్ లో తనకు నచ్చిన ఫుడ్ తింటూ అక్కడి అందాలను ఆస్వాదిస్తున్న ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. అందులో రెండు ఫోటోల్లో దర్శకుడు రాజ్ నిడిమోరు కూడా ఉండటం విశేషం! ఓ ఫోటో అయితే.. వీరిద్దరూ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నారు. రాజ్.. ఆప్యాయంగా సామ్ భుజంపై చేయి వేశాడు. అతడి సాన్నిహిత్యంలో ఉన్న సామ్ నవ్వులు చిందిస్తూ కనిపిస్తోంది. మరో ఫోటోలో రాజ్‌తో పాటు మరికొంతమంది ఫ్రెండ్స్‌తో లంచ్‌కు వెళ్లింది. ఇది చూసిన అభిమానులు.. సామ్.. రాజ్‌తో రిలేషన్‌ను అధికారికంగా ప్రకటించేసినట్లేనని అభిప్రాయపడుతున్నారు.

### ఎలా మొదలైంది?

రాజ్ నిడిమోరు, తన స్నేహితుడు కృష్ణతో కలిసి ద ఫ్యామిలీ మ్యాన్ వెబ్ సిరీస్ డైరెక్ట్ చేశాడు. ఇందులో సమంత హీరోయిన్‌గా నటించింది. అప్పుడే వీరిమధ్య ఏర్పడిన పరిచయం ప్రేమకు దారి తీసినట్లు తెలుస్తోంది. తర్వాత వీరిద్దరూ సిటాడెల్: హనీ బన్నీ వెబ్ సిరీస్ చేశారు. సమంత చేతిలో ఉన్న రక్త బ్రహ్మాండ్: ద బ్లడీ కింగ్‌డమ్ ప్రాజెక్టుకు సైతం రాజ్ దర్శకత్వం వహిస్తున్నాడు.

# రాజా సాబ్‌తో స్టెప్పులు?

హీరోయిన్ తమన్నాది డిఫరెంట్ స్టైల్. ఒకవైపు హీరోయిన్‌గా సినిమాలు చేస్తూనే, మరోవైపు వీలు కుదిరినప్పుడల్లా ఇతర సినిమాల్లో స్పెషల్ సాంగ్స్‌లో సూపర్బ్‌గా డ్యాన్స్ చేస్తూ, అందుకు తగ్గట్టుగా భారీ పారితోషికం అందుకుంటుంటారు. ఇప్పటికే తమన్నా పదికి పైగా స్పెషల్ సాంగ్స్ చేశారు. 2023లో వచ్చిన రజనీకాంత్ 'జైలర్' సినిమాలో 'నువ్.. కావాలయ్యా..', 2024లో శ్రద్ధా కపూర్–రాజ్‌కుమార్ రావుల 'స్త్రీ 2' చిత్రంలో 'ఆజ్ కీ రాత్' సాంగ్స్‌లో తమన్నా అదిరిపోయే స్టెప్పులు ప్రేక్షకులను అలరించాయి.

ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడానికి ఈ పాటలు బాగా ఉపయోగపడ్డాయి. తాజాగా తమన్నా మరో స్పెషల్ సాంగ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఫిల్మ్‌నగర్ సమాచారం. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న హారర్ కామెడీ అండ్ ఫ్యాంటసీ సినిమా 'ది రాజా సాబ్'. ఈ సినిమాలోని ఓ స్పెషల్ సాంగ్‌లో ప్రభాస్‌తో కలిసి తమన్నా డ్యాన్స్ చేయనున్నారట. ఈ చిత్రానికి తమన్ సంగీతదర్శకుడు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబరు 5న విడుదల కానుంది.



## మార్వెల్ నుంచి మరో సినిమా.. యాస కోసం పెడ్రో పాస్కల్ కష్టాలు

మార్వెల్ స్టూడియోస్ నుంచి కెవిన్ ఫీజ్ నిర్మాణంలో, మాట్ షాక్‌మాన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ది ఫెంటాస్టిక్ ఫోర్: ఫస్ట్ స్టెప్స్' సినిమా జూలై 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. మార్వెల్ కామిక్స్‌లోని మొదటి సూపర్ హీరో కుటుంబం, గ్రహాలను మింగేసే గెలాక్టస్‌తో జరిగే ఉత్కంఠభరిత పోరాట కథతో ఈ చిత్రం రూపొందింది. ఇండియాలో ఈ సినిమా తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్త ప్రమోషన్లలో భాగంగా, రీడ్ రిచర్డ్స్ పాత్రలో నటిస్తున్న పెడ్రో పాస్కల్ వానిటీ ఫెయిర్‌తో మాట్లాడుతూ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ సినిమా కోసం 1960ల నాటి యాస అలవర్చుకునేందుకు తాను 100 శాతం ప్రయత్నించానని, కానీ సిబ్బంది తనను వెనక్కి లాగారని తెలిపారు. "నేను ఆ యుగంలోని మిడ్‌అట్లాంటిక్ యాసను పట్టుకోవడానికి గట్టిగా ప్రయత్నించాను. కానీ సిబ్బంది నన్ను 'మీలాగే మాట్లాడు' అని చెప్పారు. ఈ సినిమా ఇప్పటివరకూ చూసిన దానికంటే భిన్నమైన అనుభవాన్ని ఇస్తుంది," అని పెడ్రో వెల్లడించారు. ఆ రకమైన మాండలికం కోసం తమకు ఓ కోచ్‌ని కూడా ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ చిత్రంలో సూ స్టార్మ్‌గా వెనెస్సా కిర్బీ, జానీ స్టార్మ్‌గా జోసెఫ్ క్విన్, బెన్ గ్రిమ్‌గా ఎబోన్ మోస్‌బాచ్రాచ్, గెలాక్టస్‌గా రాల్ఫ్ ఇనేసన్, సిల్వర్ సర్ఫర్‌గా జూలియా గార్నర్ నటించారు.



# అయోత్తి రీమేక్‌లో?



తమిళ హీరో ధనుష్‌తో కలిసి నాగార్జున చేసిన 'కుబేర' సినిమా ఈ జూన్ 20న విడుదలై, సూపర్‌హిట్‌గా నిలిచింది. రజనీకాంత్ హీరోగా నటించిన 'కూలీ' సినిమాలో నాగార్జున విలన్‌గా నటించగా, ఈ చిత్రం ఆగస్టు 14న విడుదల కానుంది. అలాగే నాగార్జున వందో సినిమా పనులు తమిళ దర్శకుడు ఆర్.ఎ. కార్తీక్‌తో జరుగుతున్నాయి. కాగా తాజాగా శశికుమార్ ప్రధాన పాత్రలో నటించిన తమిళ చిత్రం 'అయోత్తి' పట్ల నాగార్జున ఆసక్తిగా ఉన్నారట. 2023లో విడుదలై, ప్రేక్షకులను మెప్పించిన ఈ సినిమాను తెలుగులో రీమేక్ చేయాలని నాగార్జున ప్లాన్ చేస్తున్నారని సమాచారం. ఒకవేళ ఈ రీమేక్ వార్త నిజమే అయితే ఈ సినిమాలో ఆయనే హీరోగా నటిస్తారా? లేక నిర్మాణం వరకే పరిమితమవుతారా? అనేది చూడాలి. ఇక 'అయోత్తి' కథ విషయానికి వస్తే... ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో జీవించే బలరాం తీర్థయాత్ర కోసం తమిళనాడులోని రామేశ్వరానికి వెళతాడు. కానీ అనుకోకుండా జరిగిన ప్రమాదంలో బలరాం భార్య జానకి, కూతురు శివానీ గాయపడతారు. చికిత్స తీసుకుంటూనే జానకి మరణిస్తుంది. దీంతో జానకి మృతదేహాన్ని అయోధ్యకు తీసుకెళ్లాలని బలరాం అనుకుంటాడు. కానీ అతనికి అనుకోని సమస్యలు వస్తాయి. ఆ సమస్యలను ఎదుర్కొని, అబ్దుల్ మాలిక్ అనే వ్యక్తి సాయంతో జానకి మృతదేహాన్ని అయోధ్యకు బలరాం ఎలా తీసుకుని వెళ్లాడన్నదే 'అయోత్తి' సినిమా.

# అలీ మేనల్లుడు ఆత్మహత్య..

## 15 ఏళ్ల తర్వాత బయటపెట్టిన కమెడియన్!



కమెడియన్ అలీ సినిమాల్లోనే కాదు బయట కూడా చాలా సరదాగా ఉంటాడు. మూవీ ఈవెంట్స్‌లో అందరిపై పంచులు వేస్తూ నవ్వులు పూయిస్తుంటాడు. కానీ నిన్న జరిగిన ఓ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌లో 15 ఏళ్ల క్రితం తన ఫ్యామిలీలో జరిగిన ఓ విషాదకర విషయాన్ని చెప్పి అందరిని ఎమోషనల్‌కు గురి చేశాడు. సుహాస్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఓ భామ అయ్యో రామ'. మలయాళంలో జో అనే చిత్రంతో అందరి హృదయాలను దోచుకున్న నటి మాళవిక మనోజ్ ఈ చిత్రంతో టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. రామ్ గోధల దర్శకుడు. వీ ఆర్ట్స్ బ్యానర్‌పై హరీష్ నల్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జూలై 11న చిత్రం ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు. ఈ సందర్భంగా అలీ మాట్లాడుతూ.. ఈ సినిమాలో నటించడానికి తాను ఎందుకు ఒప్పుకున్నాడో వివరించాడు. ఈ సినిమా దర్శకుడు రామ్ నా దగ్గరకు వచ్చి 'సుహాస్‌కి మేనమామ క్యారెక్టర్ చేయాలి' అన్నారు. వెంటనే నేను ఓకే చెప్పాను. ఎంత ఇస్తారని (రెమ్యునరేషన్) అడగలేదు..ఎన్ని రోజులు కావాలని అడిగాను. వెంటనే ఎందుకు ఒప్పుకున్నానంటే.. సుహాస్‌కి మామయ్య క్యారెక్టర్ చేయాలి అన్నారు. ఎంత ఇస్తారు అని అడగలేదు. ఎన్నిరోజులు కావాలని అడిగా. ఎందుకు చేస్తాననిచెప్పానంటే... 15 ఏళ్ల క్రితం నా మేనల్లుడు ఆత్మహత్య చేసుకొని చనిపోయాడు. మా అక్క చనిపోతే.. అతన్ని మా అమ్మే పెంచింది. నా ముందే ఎదిగాడు. ఒక అమ్మాయిని ప్రేమించాడు. ఆమె మాత్రం నో చెప్పింది. ఆ మనస్థాపంతో నా మేనల్లుడు ఆత్మహత్య చేసుకొని చనిపోయాడు. అప్పటి నుంచి రెండేళ్ల పాటు ఆ అమ్మ ప్రతి రోజు ఏడ్చింది. మనవడు అయినా.. కొడుకులా పెంచింది. ఈ సినిమా స్టోరీ చెప్పగానే నాకు మేనల్లుడు గుర్తొచ్చాడు. సుహాస్‌లో చనిపోయిన నా మేనల్లుడుని చూసుకున్నాను. అందుకే ఈ పాత్రకి నేను బాగా కనెక్ట్ అయ్యాను' అని అలీ ఒకింత భావోద్వేగానికి గురయ్యాడు. ఆ తర్వాత మళ్లీ తనదైన శైలీలో పంచులేసి..అందర్నీ నవ్వించాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com